Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 1 | కరీంనగర్ | మంగళవారం 26 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## పద్మ పురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాన్ని భారత మహిళల కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ స్వీకరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా హర్మన్‌ప్రీత్ పద్మ శ్రీ అవార్డును అందుకున్నారు. టీమిండియా కలను సాకారం చేసి.. మహిళా క్రికెట్

11లో

## కాక్రోచ్ జనతాపార్టీపై అత్యసవర విచారణ

- అంతగా భావోద్వేగానికి గురికావద్దు
- తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి సూర్యకాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చ డం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్య లతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు

11లో



## కోటిమంది మహిళలను

# కోటీశ్వరులను చేస్తాం





- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్‌గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 25 : తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే

11లో

## అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు

# శాశ్వత పరిష్కారం



- తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత - పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం - రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్యలు - మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 25 : నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా

11లో

## బిఆర్ఎస్ వచ్చాక

# 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం - నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కట్టన్నా కట్టారా - అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా - సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే - కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 25 : బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా

11లో

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

- పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి ముర్ము
- కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదా నం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్,

11లో

## మద్దతు ధరలు పెంచి

# కేంద్రం చేతులు దులుపుకుంటోంది

- కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు
- తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
- లెఫ్ట్ నేతలతో భేటీలో సిఎం రేవంత్ వివరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన

హైదరాబాద్, మే 25 : కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీ నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా

11లో

## ముఖ్యమంత్రితో పలువురు భేటీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 25 :సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలువురు కలిశారు. ఇటీవల ఎంపికైన వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వైస్ చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తమను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారు ప్రస్తావించారు. వీరితో మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాసరెడ్డిలు ఉన్నారు.

## ప్రధాని మోడీ విధానాలే

# దేశానికి శాపం

### మీడియా సమావేశంలో విహెచ్ విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,మే 25 : ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయిందని.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమ వారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పెట్రోల్ కొరత, విపరీతమైన ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన మీడి యాతో

11లో

# బతికుంటే సహాయం సున్నా

- చస్తే దక్కని కనీస మర్యాద
- వ్యక్తి మృతదేహాన్ని మోసుకెళ్లిన ఘటన దారుణం
- ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, మే 25 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితి చాలా దారుణంగా దిగజారిపోయిందని ఆరోపించారు. ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బతికి ఉన్న ప్పుడు సహాయం లేకపోయినా, మరణానంతరం కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఓ పోస్టు పెట్టారు. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలని కేసీఆర్ హయాంలో భావించి, మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అదే మానవత్వం, అదే ప్రజల గౌరవాన్ని కాపాడే పాలన అని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసోందని.. ప్రజలకు అవసరమైన కనీస వసతులను అందించడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల కోసం ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. రాజకీయ

11లో

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్దాలు
- ఎన్నాసన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సిద్దిపేట, మే 25 : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్

11లో

## సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

- ఇందిరమ్మ ఇళ్లు ఉంటున్న వారిని అడిగితే తెలుస్తుంది
- కెటిఆర్ సవాల్‌కు మంత్రి పొంగులేటి ప్రతిసవాల్



హైదరాబాద్, మే 25 : సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ

11లో

# నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సిపిఐ రాష్ట్ర బృందం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సిపిఐ రాష్ట్ర ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ఏ,బీ,సీ స్టేషన్ల స్థానంలో కొత్తగా 2x800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మించాలని కోరినట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు నూతన ఆర్టీసీ బస్ స్టాండ్ భవనాలు మంజూరు చేయాలని, కొత్తగూడెం మున్సిపాలిటీని "కొత్తగూడెం--పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్"గా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. కిన్నెరసాని ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధి, హరిత రిసార్ట్, బడ్జెట్ హోటల్ పూర్తి పనులకు అదనపు నిధులు విడుదల చేయాలని కోరామని తెలిపారు. అలాగే ముర్రేడు వాగు రీన్‌ఫోర్స్ సాయిల్ వాల్ నిర్మాణానికి రూ.50.50 కోట్లు, సింగభూపాలెం, చింతల చెరువుల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపిణీ కాలువల డిజైన్ మార్పులు చేపట్టాలని, నియోజకవర్గంలో 20 ఎకరాల్లో సమగ్ర క్రీడా స్టేడియం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ పనులకు రూ.11.60 కోట్లు, గిరిజన మహిళా డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణానికి రూ.25 కోట్లు, సుజాతనగర్ జూనియర్ కాలేజీ, కొత్త ఐటీఐల్లో సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరామన్నారు. పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో కాత్ ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యాలు కల్పించాలని, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. జీవో నెం.76 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ, పోడు భూముల సమస్య పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విడుదల, కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలం గుర్తింపు వంటి అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పాస్‌పోర్ట్ కార్యాలయం ఏర్పాటు, మైలారం రాగి గని పునఃప్రారంభం, పాండురంగాపురం-భద్రాచలం రైల్వే లైన్ సాధన, డీఎంఎఫ్‌టీ నిధుల విడుదలతో పాటు ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తాము సమర్పించిన వినతిపత్రంలోని అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**- అభివృద్ధిలో కమ్మ సంఘాలను భాగస్వామ్యం చేయాలి : సీఎం సూచన**
**- పేదల సంక్షేమం, రాజకీయ చైతన్యంపై దృష్టి పెట్టాలని ఆదేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కూకట్‌పల్లి, మే 25 : తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేష్‌ను నియమించిన నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముఖ్యమంత్రికి పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని కమ్మ సంఘాలన్నింటిని ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. కమ్మ కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను నిలబెట్టే విధంగా పనిచేయాలని, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా పేదల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించినట్లు బండి రమేష్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు, కార్పొరేషన్‌కు చెందిన సంఘాలు, సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డిప్యూటీ చైర్మన్ పరుచూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 25 : సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఈ ఏడాది ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం టన్నెల్ పనులను పరిశీలించిన మంత్రి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అంకిత్, దివాకర్ టీఎస్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలతో కలిసి టన్నెల్‌లోకి వెళ్లి పురోగతిని సమీక్షించారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ప్రజల చిరకాల స్వప్నమని మంత్రి తెలిపారు. గతంలో సిల్ట్ సమస్యలు, అనుమతుల లోపం, నిధుల కొరత కారణంగా ప్రాజెక్టులు నిలిచిపోయాయని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు తర్వాత సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, గత ప్రభుత్వంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఇప్పటికే ప్రాజెక్టుపై రూ.10 వేల కోట్లు ఖర్చయ్యాయని, మరో రూ.7-8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తవుతాయని తెలిపారు. వచ్చే జూన్ నాటికి వైరా ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని, యాతాలకుంట టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలని ఆకాంక్షించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11 వేల ఎకరాల భూమి అవసరమని, భూసేకరణలో రైతులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని చెప్పారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని తెలిపారు. గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు పెరిగి రైతుల ఆదాయం మెరుగవుతుందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ కేంద్ర నిర్లక్ష్యం వల్ల ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వసుంధర, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం కోసం వెయ్యి గజాల స్థలంలో భవన నిర్మాణం..

**- అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు..**
**- ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు...**
**- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు మే 25 : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గస్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కుంపటి రగిలించిన రచ్చ గుట్ట మట్టి తరలింపు

**- అన్ని పార్టీలు వద్దు అంటున్నాయి - మరి మట్టి తరలించే సూత్రధారి ఎవరు**

(కోల లక్ష్మణ్ - ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 25 : పెద్దపెల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి ప్రకృతి అందించిన సహజ సంపద కోట్లకి విలువచేసే ఎర్ర మట్టి చరిత్ర పుటల్లో ఎంతో ప్రాధాన్యత గల పాల ఎర్ర నలుపు ఆకుపచ్చ రకరకాల రంగులతో కలబోసుకున్న గులకరాళ్ళ ఆకృతి చిహ్నాలు రచ్చ గుట్టకు ఎంతో చరిత్ర ఉందని ఆ గ్రామ వృద్ధులు చెబుతున్న అనుభవాలు మాటలు అన్ని ఇన్ని కావు... అయితే ఇప్పుడు రచ్చ గుట్ట మట్టి తరలింపు వ్యవహారం ఆ గ్రామంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల మధ్య రాజకీయ వేడి కుంపటిని రగిలించే దశకు చేరింది. గ్రామ వృద్ధులు తెలిపిన వివరాల ప్రకారం రచ్చ గుట్ట అసలు పేరు... కచ్చ కాయల గుట్ట అని పిలిచేవారట... అంటే మన తాత ముత్తాతల కాలంలో ప్రతి పల్లెలో అందరూ ఆడుకునే ఆట "కచ్చ కాయల ఆట" రంగురంగులతో ఉండే చిన్న చిన్న గులకరాళ్ళను తీసుకొచ్చి" ప్రస్తుతం అంతరించి పోయిన మసకబారుతున్న క్రీడ కచ్చకాయల ఆటకు ఈ గుట్ట నుంచి తీసుకొచ్చి ఆడుకునే వారంట... ఆ ఆటల పోలికలే ప్రస్తుత కాలంలో ప్రసిద్ధి చెందిన" చెస్.. కైలాసం... అట్టాచమ్మ లాంటివి నాటి... కచ్చకాయల ఆటగా వృద్ధులు చెప్పిన మాటలు. కాలక్రమంలో కచ్చకాయల గుట్ట.. రచ్చ గుట్టగా జనం వడకగా మారిపోయింది.. ఈ గుట్టలో ఉన్న ప్రతి రాయి రత్నం లాగానే ఏదో ఒక రూపంలో అత్యంత విలువైనదిగా కనిపిస్తూ ఉంటుంది.. అంతేకాదు ఈ గుట్ట మట్టి "ఎర్ర మట్టి" రోడ్ల నిర్మాణంలో ఇంజనీరింగ్ విభాగం వాళ్లు ఉపయోగించాలని చెప్పడమేకాదు అసలు సిసలైన మట్టి ఇది ఇట్లాంటి ఎర్రమట్టి ఈ ప్రాంతంలో లేదనే చెప్పాలి ఉన్న ఇంతటి నాణ్యత ఉండదనేది రోడ్ల నిర్మాణ పర్యవేక్షకులు ఇంజనీర్లు అంటున్న మాట.. ఇంత చరిత్ర గల రచ్చ గుట్ట మట్టిని గత కొద్ది రోజులుగా రామగుండం రైల్వే స్టేషన్ బ్రిడ్జి చివరి నుంచి పెద్దంపేట్ అంతర్గాం జంక్షన్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఈ రోడ్డు కోసం సదర్ కాంట్రాక్టర్ మట్టి తరలిస్తున్నారు. ఈ తరలింపుపై గత వారం రోజుల క్రితం పెద్దంపేట గ్రామానికి వచ్చిన బిఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దన్నపేట గ్రామ నాయకులతో కలిసి రచ్చగుట్ట మట్టిని గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా తరలిస్తున్నారని ఆరోపించారు. హరీష్ రెడ్డి ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ పెద్దంపేట్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్‌కు ఎలాంటి సంబంధం లేదని చేసిన ఆరోపణలను నిరూపించేందుకు రచ్చ గుట్ట కాడికి రావాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ పెద్దపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పెండ్యాల మహేష్, అంతర్గాం మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం కిరణ్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆముల శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులు గ్రామ టిఆర్ఎస్ పార్టీ నేతలకు వ్యాళ్ల హరీష్ రెడ్డికి సవాల్ విసిరారు. 10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అక్రమ మట్టి తరలింపు రచ్చ గుట్ట నుంచి తరలించారు. అప్పుడు తరలించిన వారే ఇప్పుడు మాట్లాడేది ఏంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఈ వివాదంలోకి గత నాలుగు రోజుల క్రితం సదర్ రోడ్డు కాంట్రాక్టర్ సైతం తాము రోడ్డు నిర్మాణానికి రచ్చ గుట్ట నుంచి మట్టి తరలించేందుకు రెవెన్యూ అధికారుల ద్వారా పర్మిషన్ తీసుకున్నామని అనడం, ఈ వివాదంలో మరో సమస్యగా తలెత్తింది. ఇదిలా ఉంటే బిఆర్ఎస్ నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి రచ్చ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలించరాదని కోర్టు ద్వారా స్టే తెచ్చామని ప్రకటించడం మరో గాలి దుమారమైంది. పెద్దంపేట గ్రామంలో అత్యంత ప్రాధాన్యత గల పార్టీ సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ మిగతా పార్టీల వివాదాల్లో తలదూర్చకుండా ప్రకృతి సంపద రచ్చ గుట్టను కాపాడుకోవడం కోసం తమ పార్టీ తమదైన వ్యూహంలో ఉందని గ్రామ ప్రజల సహకారంతో రచ్చ గుట్ట విలువైన ప్రకృతి సంపదను రక్షించుకుంటామని ప్రకటించడం, చివరకు అన్ని పార్టీలు రచ్చ గుట్ట మట్టిని తరలించ వద్దని ప్రకటించాయి... ప్రకటిస్తున్నాయి. మరి సదర్ రోడ్డు కాంట్రాక్టర్ రచ్చ గుట్ట నుంచి మట్టిని ఏ అదృశ్య శక్తి అండ దండలతో తరలిస్తున్నాడనే... ప్రశ్నకు... జవాబు ఎక్కడుందనేది.. తేల్చాల్సింది రెవిన్యూ మైనింగ్ అధికారులనేది జగమెరిగిన సత్యం.. పెద్దంపేట రచ్చ గుట్ట రగులుతున్న రాజకీయ కుంపటి పెనుమంటగా మారకముందే రెవిన్యూ మైనింగ్ శాఖల అధికారులు తేల్చాలని పెద్దంపేట గ్రామ ప్రజలు కోరుతున్నారు.. గగ్గోలు పెడుతున్న అన్ని రాజకీయ పార్టీలు సైతం ఈ దిశగా అడుగులు వేసి వారి నిజాయితీని నిరూపించుకోవాలని ఇక్కడి జనం అంటున్నారు... మరి ఎవరు ఎలా స్పందిస్తారు వేచి చూద్దాం..



# మహిళలకు చీరల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జమ్మికుంట మే 25 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం రోజున 28వ వార్డులో కౌన్సిలర్ ఒగ్గు రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళ సంఘాలలోని సభ్యులకు, సంఘంలో ని మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమం మరో మూడు రోజులు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పి పద్మ, ఓబి స్వరూప, అనితలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలి : కొత్వాల

**డివిజన్ స్థాయి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 25:రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 36వ డివిజన్ గట్టాయిగూడెం, 9వ డివిజన్ పెటచెర్వులో కాంగ్రెస్ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు కొత్వాల శ్రీనివాసరావుతో పాటు డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, 4 లక్షల రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.



అదేవిధంగా సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రెండు లక్షల మందికి ఫించన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, చరపా శాంతా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, కోండం వెంకన్న గౌడ్, నరహరి, భట్టు మురళి, మహీపతి రామలింగం, పైడిపల్లి మహేష్, నరిగె సుజాత, గుర్రం వెంకటరత్నం, వీర కుమార్, చరపా పాపారావు, కాపా శ్రీను, రేనాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

**- మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యం**
**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 25 : మహిళలను వేధిస్తే చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడ తాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళ వారోత్సవాలలో భాగంగా మహిళా భద్రత - రక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా, భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని అన్నారు. పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో 10 మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని,ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై నిర్దేశిత గడువులోపు చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు. పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని,ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ-టీమ్స్,భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ, జిల్లాలో మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఘనంగా మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోష్ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. బాల్య వివాహం -- బతుకు ఆగం అనే నినాదంతో బాల్యవివాహాల రహిత ములుగు జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు,మున్సిపల్ చైర్మన్ చంద్రకళ బిక్షపతి,ఆర్డీవో వెంకటేష్,డీఎస్పీ కిషోర్,జిల్లా అధికారులు,సీడీపీఓలు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

# గొల్లపాడులో పామాయిల్ తోట దగ్ధం

**- 10 ఎకరాల్లో పంట నష్టం... ఆవేదన వ్యక్తం చేసిన రైతులు**

ఖమ్మం, మే 25:ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లపాడు గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించి సుమారు 10 ఎకరాల పామాయిల్ తోట మంటల్లో దగ్ధమైంది. రైతులు షాబాద్ శ్రీనివాస్ రెడ్డి, షాబాద్ హనుమంతు రెడ్డి, మద్ది మల్లారెడ్డికి చెందిన పామాయిల్ తోటలు పూర్తిగా కాలిపోయాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిద కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పామాయిల్ చెట్లతో పాటు మోటార్లు, టార్పాలిన్ పైపులు కూడా కాలిపోవడంతో భారీ నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. వేసవి ఎండల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి తోట మొత్తం దగ్ధమైనట్లు స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ పంతులు నాయక్‌తో పాటు పలువురు నాయకులు ఘటన స్థలాన్ని పరిశీలించి రైతులను పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగా శ్రీనివాసరావు, షాబాద్ మాధవ రెడ్డి, తొండల రవి, సింగిరెడ్డి బోసి రెడ్డి, సింగిరెడ్డి రామిరెడ్డి, మందడి వెంకట్ రెడ్డి, శ్యామల రామ్ రెడ్డి, రుద్ర ఉపేందర్, శావిడి కరుణాకర్, కొండం ప్రభాకర్, సంపేట శీను, పరికపల్లి సుదర్శన్, టీం పొంగులేటి పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరేంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.




# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

## - మంత్రి కొండా సురేఖ - పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్
## - మంత్రి దామోదర రాజనర్సింహ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 25 : అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసు కుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ. 1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టిజిఐసి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బ బాధితులకు సత్వర వైద్య సేవలు అందించాలి

## - ఖని ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించి, రోగులతో మాట్లాడి, వైద్యులతో సమీక్ష
## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 25 : వడ దెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సదా సిద్ధంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఇటీవల ఎండల తీవ్రతతో వడ దెబ్బ బారిన పడి ప్రజలు అస్వస్థత గురవడం, వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో మేయర్ సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వడదెబ్బ బాధితులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వార్డులలో తిరుగుతూ రోగులతో మాట్లాడి అనంతరం వైద్యులతో సమీక్షించారు. ఈ సంధర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వైద్యులు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని , వివిధ విభాగాల అధిపతులు అందుబాటులో ఉండడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు . నీటిని శుద్ధి చేసే యంత్రాలు, చాలా చోట్ల ఫ్యాన్లు, కూలర్లు పని చేయడం లేదని, ఐసియు, అత్యవసర వార్డులలో లో ఎ సి లు పని చేయడం లేదని తెలిపారు. కాగా కొత్తగా 10 కూలర్లు, 20 ఫ్యాన్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. వడ దెబ్బ ప్రబావాన్ని తగ్గించడానికి స్ప్రింక్లర్ లు లేవని అన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కొన్ని రకాల మందులు ప్రభుత్వం నుండి సరఫరా కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట కొనుక్కోవాలని సూచిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మేయర్ స్పందిస్తూ వైద్య సేవలు మెరుగుపరచడానికి ఆసుపత్రికి అవసరమైన వాటి కోసం లిఖిత పూర్వకంగా ఇస్తే ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మునిసిపల్ కార్పొరేషన్ నుండి అందించవల్సిన సేవలను తప్పనిసరిగా ఇస్తామని అన్నారు. ఆసుపత్రిలో అత్యవసరమైన చోట టవర్ ఎ సి లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎండల కారణంగా నగరంలో పరిస్థితి తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కువ మంది వైద్యులు గైర్హాజరు అవుతున్నవిషయం ఈ రోజు తన సందర్శనలో ప్రత్యక్షంగా గమనించానని అది పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఫోన్ కాల్స్ కు వైద్యులు స్పందించాలని అన్నారు. ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అందించే వైద్య సేవలపై దృష్టి సారించాలని అన్నారు. వడ దెబ్బ నుంచి ఉపశమనం కల్గించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రి తో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ఎసి గదులు, అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. వార్డులలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా కార్పొరేటర్ ముస్తాఫా, ఉన్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..రైతులు అధైర్య పడొద్దు : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 25 : రైతులు అధైర్య పడద్దని, ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని సాయి కృష్ణ రైస్ మిల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సాపూర్ లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఎంసిఎస్ జగదీష్ ,డిఎస్ ఓ నిత్యానంద్ తాహాసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం,కొనుగోలు సంస్థలు,రైస్ మిల్లర్లు,రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ,లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు.వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా



కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు,గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం,లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం,రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు.ధాన్యంకొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మాయ మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

## - రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది - మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
## - కూకట్‌పల్లి అభివృద్ధిని కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 25 : మాయ మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం సోమవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గాన్ని మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు కూకట్‌పల్లిలో తీవ్రమైన మంచినీటి సమస్యలు ఉండేవని, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిగా పరిష్కరించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్ అందించామని, భవిష్యత్తులో హైదరాబాద్ మహానగరానికి 24 గంటల మంచినీటి సరఫరా కూడా అందిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రిబ్బన్ కటింగ్ చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించినట్టు చూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటూ సవాల్ విసిరారు. మహిళలకు తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. జూన్ నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజల్లో పనిచేసే వారికే భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఓట్ల తొలగింపు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై కార్యకర్తలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూకట్‌పల్లి నియోజకవర్గం వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చెందిందన్నారు. బాలానగర్, జేఎన్‌టీయూ, కైతలాపూర్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, వాటర్ ట్యాంకులు, ఎస్టీపీ ప్లాంట్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క కొత్త అభివృద్ధి కార్యక్రమం కూడా ముందుకు సాగలేదని విమర్శించిన ఆయన, గతంలో ప్రతి నెల రూ.30 కోట్ల వరకు నిధులు విడుదలయ్యేవని, ప్రస్తుతం రెండున్నర సంవత్సరాల్లో రూ.25 కోట్లు కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రజల్లో పనిచేసే వారికే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ ,ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, గజ్జల నాగేష్, రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా... నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, పగుడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి ,మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు సెక్రెటరీలు,మహిళా నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

## అదనపు కలెక్టర్ అరుణశ్రీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 25 : ప్రజావాణి ద్వారా అందుతున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన గండి సుగుణ తనకు అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేయగా పౌరసరఫరాల శాఖ అధికారులకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరిఖనికి చెందిన సువర్ణ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ద్వారా పేషంట్ కేర్ విభాగంలో పని కల్పించి 15 రోజుల్లోనే తొలగించారని, తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరగా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన మాచర్ల సుగుణ తన భర్త మరణించడంతో వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరగా సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 25 : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా గూడూరు పోలీసులు లక్ష్మీపురం గ్రామంలో భారీ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు గూడూరు సీఐ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ గిరిధర్, పోలీస్ సిబ్బంది సోమవారం "కమ్యూనిటీ కాంటాక్ట్" కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాగిన ఈ ప్రత్యేక తనిఖీల్లో గ్రామంలోని సుమారు 180 ఇండ్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన 80 కిలోల నల్ల బెల్లం, 25 లీటర్ల గుడుంబా, 20 కిలోల పట్టిక, 8 బీర్ బాటిళ్లు, ఒక ఫుల్ లిక్కర్ బాటిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 380 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్బంగా గ్రామస్తులతో సమావేశమైన పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి దుష్ప్రభావాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ,ఇతర అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, టీజీఎస్పీ, ఏఆర్ ఫోర్స్ సిబ్బందితో కలిపి మొత్తం 56 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల పని వేళలల్లో మార్పు

## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి
## - ఉదయం 4 నుండి 11 గంటల లోపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), మే 25 : ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్మికుల పని వేళలు సవరిస్తున్నట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. ఎండ బారిన పడకుండా నగర పాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 11 గంటల కల్లా విధులు ముగించాలని అన్నారు. ఇటీ వల వడ దెబ్బ బారిన పడి ప్రజలు అస్వస్థత గురవడం, వరుస మరణాలు సంభవిస్తుం డడంతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పరిస్థితి సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు, పారిశుద్ధ్య విభాగానికి సంబందించిన సిబ్బంది అందరూ ఉదయం 4.00 గంటలకు విధులకు హాజరై ఉదయం 11 .00 గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు కూడా వడ దెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనిఅన్నారు. ఎండ తీవ్రత తగ్గేంత వరకు ఈ పని వేళలు అమల్లో ఉంటాయని అన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 25 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం,ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు,కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈవో ఎల్లయ్యా, ఆర్ & బీ శాఖ అధికారి వేణు, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డిఎస్పీలు, జాతీయ రహదారి అధికారులు, రవాణా శాఖ, పోలీస్ శాఖ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,మున్సిపల్ కమిషన్లు, పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో గృహిణి మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 25 : విద్యుత్ షాక్ కు గురై ఓ వివాహిత మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటింబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... ముద్దపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) సోమవారం ఉదయం కూతురు స్యారీ పంక్షన్ ఉండడంతో అల్మరలో ఉన్న బట్టలు తీసుకునేందుకు వెళ్లగా ఆల్మరాపై ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొట్టడంతో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అయి అరవడంతో కుటింబీకులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మెదక్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలుపడంతో వెంటనే కుటింబీకులు పాపన్న పేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతురాలి భర్త రవి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో
# కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పార పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దాని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్దకిస్తోంది. జెన్ జీ అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ... వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌వే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకలు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింక పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం జరిగింది. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతి రేకంగా అస్సాం గణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజారేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డారు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకట స్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపీగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వు కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పుకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండాగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్ట్ జడ్జిలని ఎందుకు తీసుకోని ప్రధాన ఎన్నికల కమిషనర్‌ని నిలదీస్తూ వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అవసరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశారు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్న ట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది.

# పౌష్టికాహారం తీసుకుంటే మనల్ని మనం కాపాడుకోవచ్చు

**- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

**- మహిళా వారోత్సవాలు న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, మే 25 : పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలులో నూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోషకాహార మేళలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్ లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుండి ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసి చాలా బాగున్నాయని తెలిపారు. అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఈ విధమైన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఇప్పటి వరకు ప్రతి వారం ఒక్కో థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటి వరకు నిర్వహించిన థీమ్ లను కింది స్థాయి నుండి పై అధికారి వరకు అందరూ సమార్ధవంతంగా పని చేసి విజయవంతం చేయడం జరిగింది. అదే విధంగా నేటి (సోమవారం) నుండి ప్రారంభమయిన మహిళా వారోత్సవాలను కూడా అందరూ సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. మనం నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి టీచర్లు గ్రామీణస్థాయి మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది. పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహన కల్పించడం కోసం నిర్వహించడం జరిగిందని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మన శరీరం మనం ఉన్నంత వరకు ఉంటుంది. అందుచేత మనం మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా మనకు ఏవిధమైన వ్యాధులు దరి చేరకుండా ఉంటామని మహిళా వారోత్సవాలలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ది దారులు, తల్లితండ్రుల చేత వంటలపోటీలు నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ ఫుడ్ పైన అవగాహన కలిగిస్తూ స్టాల్స్ నందు తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు మరియు పండ్లుకు సంబందించిన ఆహార పదార్థాలను స్టాల్ లో ప్రదర్శనకు పెట్టడం జరిగింది. జంక్ ఫుడ్ యొక్క దుష్ప్రభావాలు మరియు న్యూట్రిషన్ ఫుడ్ యొక్క లాభాలను వివరిస్తూ చాట్స్ ని ప్రదర్శించడం జరిగింది. హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో గర్భిణి బాలింతలు మరియు కిశోర బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించడం జరిగినది. గర్భిణి బాలింతలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు, వంటల పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పిడి డిఆర్డిఓ/డిడబ్ల్యూఓ శ్రీలత, సిపిఓ సౌమ్య జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ అనిత, పిడి మెప్మా, సిడిపిఓ శాంతి కుమారి, 7 ప్రాజెక్టు ల సిడిపిఓ లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మరియు డి.డబల్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గని కార్మికుల పెన్షన్ పెరగకపోవడానికి బాధ్యులు ఎవరు?

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 25 : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బొగ్గు గని కార్మికులు తమ జీవితా లను చీకటి గనుల్లో గడిపి దేశానికి వెలుగునిచ్చారు. విద్యుత్ ఉత్పత్తి నుంచిపరిశ్రమల వరకు ప్రతి రంగం బొగ్గుపైనే ఆధారపడిన కాలంలో గని కార్మికుల శ్రమ దేశాభివృద్ధికి మూలస్థంభంగా నిలిచింది. అయితే పదుల సంవత్సరాలు సేవలందించి న ఈ కార్మికులు పదవీ విరమణ అనంతరం పొందుతున్న పెన్షన్




మాత్రం జీవన వ్యయాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అనేక మంది బొగ్గు గని పెన్షనర్లు నెలకు వెయ్యి నుంచి రెండు వేల రూపాయల మధ్యే పెన్షన్ పొందుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల నేపథ్యంలో ఈ మొత్తంతో జీవించడం అసాధ్యమని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు గని పెన్షన్ పథకం-1998 అమలులోకి వచ్చినప్పటి నుంచి పెన్షన్‌లో గణనీయమైన సవరణలు జరగలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు ఇతర రంగాల పెన్షనర్లు తరచూ డి.ఏ, ఫిట్‌మెంట్, వేతన సంఘాల సిఫార్సులతో ప్రయోజనాలు పొందుతుండగా, బొగ్గు గని పెన్షనర్లకు అలాంటి అవకాశాలు దక్కడం లేదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గని కార్మికుల సంక్షేమాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినా, అమలులో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని పెన్షనర్లు అంటున్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్) కార్మికుల భవిష్యత్ భద్రత కోసం ఏర్పాటు చేయబడిన సంస్థ అయినప్పటికీ, పెన్షన్ సవరణ విషయంలో దాని పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెన్షన్ నిధుల నిర్వహణలో పారదర్శకత లేదని, పెన్షన్ పెంపుపై కేంద్ర ప్రభుత్వానికి బలమైన ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా కార్మిక హక్కుల కోసం ఒకప్పుడు బలంగా పోరాడిన కార్మిక సంఘాలు ప్రస్తుతం బలహీనపడిపోయాయనే భావన కార్మికుల్లో వ్యక్తమవుతోంది. సంఘాల మధ్య రాజకీయ విభేదాలు పెరగడం, పెన్షన్ అంశంపై ఐక్య పోరాటం లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరమైందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బొగ్గు గనుల ప్రాంతాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా పార్లమెంట్, అసెంబ్లీలలో ఈ సమస్యను సమర్థవంతంగా ప్రస్తావించడంలో విఫలమయ్యారని పెన్షనర్లు విమర్శిస్తున్నారు. వేలాది మంది పెన్షనర్ల ఓట్లు పొందిన నాయకులు వారి సమస్యలపై నిర్లక్ష్యం చూపడం బాధాకరమని పేర్కొంటున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో వెయ్యి లేదా రెండు వేల రూపాయల పెన్షన్‌తో వృద్ధులు నెల గడపడం అసాధ్యమని, మందులు, వైద్య పరీక్షలు, ఆస్పత్రి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బొగ్గు గని పెన్షనర్లు పలు డిమాండ్లు ముందుకు తెస్తున్నారు. కనీస పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని, డి.ఏను పెన్షన్‌కు అనుసంధానం చేయాలని, పెన్షన్ సవరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. అలాగే కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి, పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. కోల్ పెన్షన్ పథకం రూపొందించిన సమయంలో భవిష్యత్తులో ఉద్యోగుల వేతనాలు ఎంత వేగంగా పెరుగుతాయి, పదవీ విరమణ పొందే పెన్షనర్ల సంఖ్య ఎంతగా పెరుగుతుందనే అంశాలను సరైన విధంగా అంచనా వేయలేదని కార్మిక నాయకులు అభిప్రాయపడు తున్నారు. పథకం ప్రారంభంలోనే విరాళాల రేటు చాలా తక్కువగా నిర్ణయించడం వల్ల దీర్ఘకాలంలో పెన్షన్ భారం పెరిగిందని చెబుతున్నారు. ఈ అంశాలపై పెన్షన్ సంఘాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు నిర్వహిస్తూ, కోర్టుల్లో న్యాయపోరాటం కొనసాగిస్తున్నాయి. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా మొత్తం పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. దేశానికి సంపద సృష్టించిన బొగ్గు గని కార్మికులు వృద్ధాప్యంలో అవమానకర పరిస్థితుల్లో జీవించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని పలువురు అభిప్రాయపడుతున్నారు. గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పని చేసిన కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వం, సమాజం యొక్క నైతిక బాధ్యత అని పేర్కొంటున్నారు. "పెన్షన్ దానం కాదు... అది కార్మికుడి హక్కు" అని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు.

# నిరాదరిస్తున్న కొడుకులపై తండ్రి ప్రజావాణిలో ఫిర్యాదు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 25 : ధర్మపురి మండల కేంద్రానికి చెందిన చాడ కిషన్ (70) అనే వృద్ధుడు పెద్ద కొడుకు వంశీ కృష్ణ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నా, చిన్న కొడుకు రామకృష్ణ రైస్ మిల్లు లో గుమస్తాగా పని చేస్తున్నా తల్లి దండ్రులను పోషించడం లేదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ప్రజావాణిలో కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ బి. రాజా గౌడ్ కు, ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి లో ఏ.వో. కోట వసంతలకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ వృద్ధుడు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో విలేకరుల కు తన గోడు వినిపించారు. పోషణ వైద్య ఖర్చులు ఇవ్వాలని పెద్ద కొడుకు ను అడిగేతే పెద్ద కొడుకు, పెద్ద కోడలు మా వృద్ధ తల్లి దండ్రులను నానా వేధింపులకు గురిచేస్తున్నారని, ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం కింద తమకు ప్రతి నెల రూ.పది వేయిలు ఇప్పించాలని, చిన్న కొడుకు రైస్ మిల్లు లో తక్కువ జీతం తో పని చేస్తున్న కారణం గా అయన స్థోమత మేరకు పోషణ, వైద్య ఖర్చులు ఇప్పించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కోరారు. వృద్ధుడి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ప్రతినిధులు వెల్ముల ప్రకాష్ రావు, కే.సత్యనారాయణ, బాలయ్య తది తరులున్నారు.

# డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు - ఫల్తా గెలుపుతో టిఎంసికి బీటలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 25 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది. ఈ రీపోలింగ్‌లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఏకంగా 1,08,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి సంచలనం సృష్టించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలి ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక్కడి అభ్యర్థి పోలింగ్‌కు ముందే చేతులెత్తేశారు. విజయం సాధారణమైనది కాదు.. ఎందుకంటే ఫల్తా నియోజకవర్గం టీఎంసీ నెంబర్-2, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన 'డైమండ్ హార్బర్' లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌కు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో కమలం వికసించడం.. బెంగాల్ రాజకీయాల్లో ఇక మమతా బెనర్జీ మార్క్ హవాకు బ్రేకులు పడ్డాయనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానానికి తొలిసారిగా ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. అయితే ఆ సమయంలో అధికార టీఎంసీ ఈవీఎంల తారుమారుకు పాల్పడిందని, బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి అక్రమాలకు ఒడిగట్టిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ స్థానంలో నెలకొన్న తీవ్రతను గమనించిన ఎన్నికల సంఘం (ఇఅ) అక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేసి, మే 21న కట్టుదిట్టమైన కేంద్ర బలగాల నిఘాలో మొత్తం 285 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించింది. ఈసారి భయం లేకుండా దాదాపు 88 శాతం మంది ఓటర్లు తరలివచ్చి ప్రశాంతంగా ఓటు వేశారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీజేపీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. రౌండ్ రౌండ్‌కు మెజారిటీ పెరుగుతూ పోయింది. ఈ రీపోలింగ్‌కు ముందే ఓటమిని పసిగట్టిన టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ తాను పోటీలో నిలబడనని ముఖం చాటేయడం గమనార్హం.

అయితే చివరకు ఆయనకు ఈ ఎన్నికల్లో దక్కింది కేవలం 7 వేల పైచిలుకు ఓట్లే. ఈ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మాజీ సీఎం మమతా బెనర్జీ రిజల్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఏజెంట్లలా నటిస్తూ కేంద్ర బలగాలు కౌంటింగ్ కేంద్రాల్లోకి దూరి ఓట్లను మళ్లీ దొంగిలించాయని అంటూ ఆమె మండిపడ్డారు. మరోవైపు ఈ ఘనవిజయంపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందిస్తూ.. టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అభిషేక్ బెనర్జీ చెప్తుండే 'డైమండ్ హార్బర్ మోడల్' కాస్తా ఇప్పుడు 'తృణమూల్ నష్ట నమూనా'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. తాను ప్రజలను లక్ష మెజారిటీ అడిగితే.. వారు 1.08 లక్షల మెజారిటీతో నమ్మకాన్ని నిలబెట్టారని, ఫల్తా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మళ్లీ 'స్వర్ణ వైభవాన్ని' తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

**- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు**

**- తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచా రాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందిన వారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.



# పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

**- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. ÷ారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

**- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 25 : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.



# దేవాలయాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### - నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో బండి రమేష్ - ఆలయాలు సంస్కృతి, ఐక్యతకు ప్రతీకలు - సేవాభావంతో పనిచేయాలని కమిటీకి సూచన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 25 : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ లక్ష్మికళ సినిమా హాల్ సమీపంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా రాచమల్ల బిక్షపతి గౌడ్ ప్రమాణ స్వీకారం చేయగా, కమిటీ సభ్యులుగా కావాలి పాండు, ఎం. రమేష్, మెట్టు వినోద్, పి. నర్సింగ్ రావు, నోముల బాబురావులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ గతంలో చిన్న గుడిగా ఉన్న శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావును ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన దేవాదాయ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామంలోని ప్రతి కుటుంబంపై ఉండి ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఆలయం అనేది కేవలం పూజలు జరిగే స్థలం మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు గ్రామ ప్రజలను కలుపుకొని ఆలయ గౌరవాన్ని మరింత పెంచాలని సూచించారు. భక్తి భావంతో పాటు సేవా దృక్పథంతో పనిచేస్తూ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, దేవాలయాల పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని బండి రమేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, గాలి బాలాజీ, కోపిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, నియోజకవర్గ ఓబీసీ అధ్యక్షుడు తూము సంతోష్, రాచమల్ల శేఖర్ గౌడ్ తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వంటింటి నుంచి వ్యాపార రంగానికి... మహిళల చేతిలో కోట్ల ఆదాయ వనరులు

### - ఇందిరా మహిళా శక్తితో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు - ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


వనపర్తి, మే 25 : దేవరకద్ర నియోజకవర్గంలో మహిళల ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కొత్తకోట మండలం మిరాసపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన పెట్రోల్ బంక్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జియంఆర్) వనపర్తి జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలను కేవలం ఇంటి పనులకే పరిమితం చేయకుండా వ్యాపార రంగంలోనూ ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేలా పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు వంటి ఆదాయ వనరులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, అనుమతులు, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. బంకుల ద్వారా వచ్చే ఆదాయం నేరుగా మహిళా సంఘాల సభ్యులకే చేరి వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటైన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి పథకాలన్నీ మహిళల ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్నామని అన్నారు.

# రైతుల ఇబ్బందులపై మంత్రి జూపల్లి సీరియస్


### నాగర్ కర్నూల్ జిల్లాలో ఆకస్మికంగా రైస్ మిల్లుల తనిఖీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 25 : నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం అన్‌లోడింగ్ సమస్యలపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణా రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి, రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల మండలంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్‌ను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడ ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియ, లారీల నిల్వ పరిస్థితులను పరిశీలిస్తూ మిల్లు యాజమాన్యాలను ప్రశ్నించారు. రోజుల తరబడి ధాన్యం లోడ్ చేసిన లారీలను అన్‌లోడ్ చేయకుండా నిలిపివేయడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎన్నో కష్టాలతో పండించిన ధాన్యాన్ని రోజుల తరబడి లారీల్లోనే ఉంచడం వల్ల నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "తాలు, తరుగు" పేరుతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి జూపల్లి హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మిల్లులు, గోదాముల వద్ద ప్రతి లారీ వేగంగా అన్‌లోడ్



అయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా పోలీస్ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే రైస్ మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికార యంత్రాంగానికి సూచించారు. మంత్రి ఆకస్మిక తనిఖీలతో రైస్ మిల్లుల యాజమాన్యాల్లో కలకలం రేగగా, రైతులు మాత్రం ప్రభుత్వ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలకు భరోసా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### - మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట - 52 53 డివిజన్ల కార్పొరేటర్లు స్రవంతి, నూర్జహాన్ బేగం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


మంచిర్యాల, మే 25 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా 52,53 డివిజన్లలో మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో 52 వ కార్పొరేటర్లు నూర్జహాన్ బేగం, 53వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి కిషోర్ ,మంచిర్యాల పట్టణ యువజన కాంగ్రెస్ (యూత్ కాంగ్రెస్) అధ్యక్షుడు అబ్దుల్ జలీల్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు మక్బూల్ హుస్సేన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక సహాయం, ఆరోగ్య భద్రత, విద్యా ప్రోత్సాహక పథకాల ద్వారా మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాబోయే రోజుల్లో మహిళల సంక్షేమానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురానున్నట్లు వెల్లడించారు. మహిళలు స్వయం సమృద్ధితో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు మైనార్టీ కో-ఆప్షన్ మెంబర్ ఫర్హీం మబుల్ తనుసుం, పీడీ మెప్మా సుభాష్, టీఎంసీ చంద్రయ్య, సీఓ అరుణ, ఓబీలు, ఆర్పీలు,స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం కలగకుండా ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాలి

### పౌర సరఫరాల శాఖ సంచాలకులు శ్యాంప్రసాద్ లాల్ ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


వనపర్తి, మే 25: అకాల వర్షాల కారణంగా వడ్లు తడిచిపోయి రైతులు నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ సంచాలకులు శ్యాంప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా సివిల్ సప్లై అధికారులు, డీఎంలు, కోఆపరేటివ్ మరియు రవాణా శాఖ అధికారులతో కలిసి వడ్ల కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాల వల్ల వడ్లు తడిచిపోతే రైతులతో పాటు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలోపే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న ధాన్యం పరిమాణం, ఇంకా రైతుల నుంచి రానున్న వడ్ల అంచనాలపై ఖచ్చితమైన సమాచారం అధికారుల వద్ద ఉండాలని ఆదేశించారు. తేమ వచ్చిన వడ్లను ఆలస్యం చేయకుండా వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తోందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని



ఎక్కడ నిల్వ చేయాలి, హమాలీల కొరత రాకుండా చూడటం, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం వంటి అంశాలపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దగ్గరలోని రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగించుకోవాలని, ధాన్యం దింపుకునే కేంద్రాల సంఖ్యను సాధ్యమైనంత ఎక్కువగా పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో గన్ని బ్యాగుల కొరత లేదని, వడ్లను ఎప్పటికప్పుడు తూకం వేసి కొనుగోలు చేయాలని తెలిపారు. బ్లాక్‌లిస్టులో ఉన్న మిల్లులను ధాన్యం నిల్వ కేంద్రాలుగా ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. సీఎంఆర్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కాశి విశ్వనాథ్, మహబూబ్‌నగర్ సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్, రవాణా శాఖ అధికారి మానస, కోఆపరేటివ్ అధికారి బి. రాణి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# ఏడుపాయల చెక్ డ్యాంలో పడి గుర్తు తెలియని యువకుడు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 25 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల చెక్‌డ్యాంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 25 సంవత్సరాల వయస్సు గల ఓయువకుడు ఫ్రెంచ్‌కట్ గడ్డంతో,రెండు జతల బట్టలున్న బ్యాగుతో ఏడుపాయల వనదుర్గమ్మ దర్శనం కోసం వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం చెక్‌డ్యాం వద్ద స్నానం చేయడానికి నీటిలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగిపోయినట్లు సమాచారం. చెక్‌డ్యాం ఒడ్డున బట్టలు,బ్యాగు కనిపించడంతో అనుమానం చెందిన స్థానికులు వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గజఈతగాళ్ల సహాయంతో నీటిలో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఎలాంటి వివరాలు లభించలేదు. అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఫోటో ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ (87126 57920),మెదక్ రూరల్ సీఐ జార్జ్ (87126 57916)లను సంప్రదించాలని పోలీసులు కోరారు.



# ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వడంలేదంటూ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 25 : ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయడంలో పాపన్నపేట తహసీల్దార్ సతీష్ నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటూ సోమవారం అన్నారం, యూసుఫ్‌పేట గ్రామాలకు చెందిన ఎస్సీ వర్గాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆగ్రహానికి గురైన ప్రజలు తహసీల్దార్‌ను కార్యాలయంలోనే నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. తమకు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదని బాధితులు ఆరోపించారు. విద్య,ఉద్యోగాలు,సంక్షేమ పథకాల కోసం సర్టిఫికెట్లు అత్యవసరమని,అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధితులతో,అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

### అడిషనల్ కలెక్టర్ సంగీత


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, మే 25: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీలో "సురేష్ చారి"కి స్థానం


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్ ,మే 25 : అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, జిల్లా అడ్వైజర్‌గా, తూమోజు సురేష్ చారిని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నౌండ్ల సంతోష్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు గా ఇటీవల బాధ్యతలు స్వీకరించి విశ్వకర్మ సమాజ అభివృద్దే లక్ష్యంగా పెట్టుకుని 69 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేష్ చారి గత కొన్ని సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణ సంఘ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, ఆపదలో ఉన్న ఎంతోమందికి సహాయ సహకారాలు అందించి మంచి పేరు సంపాదించారని, అందుకే ఈ కమిటీలో ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. వారు ముందు ముందు సంఘానికి మరింత సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సముచితమైన బాధ్యతను అప్పగిస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మ సమాజానికి చెందిన వృత్తిదారులు, యువత, ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో విస్తృతస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు చేస్తామని, విశ్వకర్మ సమాజ ఐక్యతే తమ ప్రధాన లక్ష్యమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే జాతి అభివృద్ధి సాధ్యమవుతుందని సంతోష్ చారి పేర్కొన్నారు.

# దూరంగా ఉండాలి : అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే 25 : పోషకాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాల తొలి రోజు సందర్భంగా పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే పోషకాహార పదార్థాలతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆహార వైవిధ్యం పట్ల అవగాహన పెంచేందుకు పోషకాహార వంటకాలు, పదార్థాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. "జంక్ ఫుడ్‌కు నో చెప్పండి" అనే నినాదంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చిన్నపిల్లలు, యువత జంక్ ఫుడ్ అలవాట్ల వల్ల ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను వివరించారు. ప్రకృతి సిద్ధమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా) నిర్ధారణ కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు, బాలింతలు, గర్భిణీలు పోషకాహారాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల్లో నష్టపోయిన గీత కార్మికులకు నష్టపరిహారం అందించాలి

**- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 25 : జగిత్యాల జిల్లాలో ఇటీవల అగ్ని ప్రమా దాల కారణంగా భారీ సంఖ్యలో ఈత చెట్లు కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరి హారం అందించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు ఎంపీ అర్వింద్ తెలిపారు. అగ్ని ప్రమాదాల వల్ల ఈత చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీత కార్మికులు, రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సంవత్సరాల పాటు పెంచుకున్న ఈత చెట్లు కాలిపోవడం వల్ల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టం జరిగిన ప్రాంతా ల్లో అధికారులు వెంటనే సర్వే నిర్వహించి, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ఎంపీ అర్వింద్ కోరారు. అలాగే భవి ష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా స్పందించి, బాధిత కుటుం బాలను ఆదుకోవాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు.

## గిరిజన నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 25 : ఐటీడీఏ ఎటునాగారం ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువకులకు వివిధ రంగాలలో ఉచిత భోజన వసతితో శిక్షణ కల్పించబడునని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేసారు. మల్టీస్కిల్ టెక్నీషి యన్ (ఎలక్ట్రికల్) 94 రోజులు, ఎయిర్ కండీషనర్ టెక్నీషియన్ 122 రోజులు. ఫైబర్ ఆప్టికల్ టెక్నీషియన్ 103 రోజులు. ఈ కోర్సులకు వయసు. 18 నుంచి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. పదవ తరగతి ఆపైన చదువుకొని ఉండ వలెనని ఇట్టి కోర్సులు పిఎంహెచ్ (బాలురు) మహబూబాబాద్ నందు ప్రారంభం కాను న్నట్లు తెలిపారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువకులు తమ యొక్క దరఖాస్తులను కలెక్టరేట్, డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసు మహబూబాబాద్ నందు సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువకులు సద్వినియో గం చేసుకోవాలని, శిక్షణానంతరం వివిధ ప్రముఖ ప్రైవేటు కంపెనీల నందు ఉపాధి అవకాశాలు కల్పించబడేందుకు సర్టిఫికెట్ అందచేయ డం జరుగుతందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు కోసం 9849560 585 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం

**- 10వ మహాసభను జయప్రదం చేయాలి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్,మే 25 : ఈ నెల 31వ తేదీన మెదక్ జిల్లా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం 10వ మహాసభను జయప్రదం చేయాలని మెదక్ జిల్లా ఉపకోశాధికారి బుద్ధి ఏశయ్య యాదవ్ మీడియాకు తెలిపారు.సోమవారం రోజు మెదక్ పట్టణంలోని అతిథి గృహంలో అయిన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన జరిగే మెదక్ జిల్లా అభినందన మహాసభకు ముఖ్య అతిథులుగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దరిపల్లి చంద్రం,జిల్లా అధ్యక్షులు మన్నెకిషన్ రానున్నట్లు అయిన తెలిపారు. మా న్యాయమైన కోరికలు ఉపాధి హామీ కూలీలని మా వెల్ఫేర్ బోర్డు నుండి తొలగించాలని వారి సభ్యత్వంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వెల్పర్ బోర్డుకు మా కార్మికుడిని చైర్మన్ నియమించాలని ఆయన అన్నారు.నిజమైన కార్మికులను గుర్తించి పది లక్షల వరకు పనిముట్లు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన వారికి రూ.5000 పెన్షన్ కల్పిస్తూ కార్మికుని కార్డును శాశ్వత కాలం ఇస్తూ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ అందజేయాలని మా ప్రధాన డిమాండ్ అని వెల్లడించారు.మెదక్ జిల్లా అభినందన మహాసభను కార్మిక సోదరులు విజయం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

**- జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

**- కన్నతండ్రిని వేధించిన ఇద్దరు కుమారులపై కేసు నమోదు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 25 : వనపర్తి జిల్లాలో వృద్ధ తల్లిదండ్రులపై జరుగుతున్న వేధింపులపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు. ఆస్తి కోసం కన్నతండ్రిని మోసం చేసి, అనంతరం ఆయనను ఇంటికి రానీయకుండా వేధించిన ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని మెట్టుపల్లికి చెందిన వృద్ధుడు రంగం హనుమన్న తన గోడును జిల్లా ఎస్పీకి వినిపించారు. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, అందులో ఒకరు అనారోగ్యంతో మృతి చెందగా, మిగిలిన ఇద్దరు కుమారులు చిన్న కృష్ణయ్య, రాములు తన పేరుమీద ఉన్న భూమిని తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకుని ప్రస్తుతం తనను ఇంటికి రానీయకుండా, అన్నం పెట్టకుండా, శారీరకంగా మరియు మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వృద్ధుడి బాధను విన్న ఎస్పీ సునీత రెడ్డి వెంటనే స్పందించి హనుమన్నకు న్యాయం చేస్తా మని భరోసా ఇచ్చారు. అనంతరం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేయించి చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. అలాగే మానవతా దృక్పథంతో స్పందించిన ఎస్పీ, వృద్ధుడిని వృద్ధాశ్రమంలో చేర్పించి సహాయం అందించారు.

# ఎండలు సలసల.. ప్రజలు విలవిల




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 25 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిని మించి ఎండలు దంచి కొడుతుండడంతో ప్రజలు విలవిల చెందుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎండలు తీవ్రస్థాయిలో దంచి కొండుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కి చెందుతున్నారు. ఉదయం ఏడు గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత వాతావరణం కొద్దిగా చల్లబడుతుండడంతో ఆ సమయంలో ప్రజలు బయటికి వెళు నారు. ఒకవైపు వేడి మరోవైపు వేడి గాలులు ప్రజలను పరేషాన్ చేస్తున్నాయి. ఎండ వేడిమికి తట్టుకోలేక బస్సు డ్రైవర్లు కండక్టర్లు సైతం బస్సుల్లో విధులు నిర్వహించేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరు కండక్టర్లు కిటికీ వైపు తట్టు బొంతను ఏర్పాటు చేసుకొని నీళ్లు చల్లి వేడి నుండి ఉపశమనం పొందుతున్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు సైతం దంచి కొడుతున్న ఎండలకు పరేషాన్ అవుతున్నారు. ఇన్ని రోజులు దంచి కొట్టిన ఎండలకు తోడు సోమవారం నుండి రోహిణి కార్తె ప్రారంభమై 15 రోజులు ఉండడంతో మరింత వేడి ఉండనుంది. భానుడి భగభగ లతో ఏసీలు, కూలర్లు సైతం పనిచేయడం లేదు. ఒక్క నిమిషం కరెంటు పోతే ఉక్కపోతకు భరించలేకపోతున్నారు. అత్యవసరమైన పనులు ఉంటేనే బయటికి వెళ్లాలని అనవసరంగా బయట తిరుగుద్దని వైద్యులు సూచిస్తున్నారు. అది కూడా వేడి గాలులు తాకకుండా చెవులకు రుమాలు కట్టుకోవాలని, తాగునీరు, మజ్జిగ, ఓ ఆర్ ఎస్ లాంటి ద్రావణాలను ఎక్కువగా తీసుకోనీ జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. వాంతులు ,విరోచనాలు కడుపులో మంట, నీరసం లాంటి లక్షణాలు కలిగితే వెంటనే సమీప ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని వారు పేర్కొంటున్నారు. ఇది ఇలా ఉండగా దాహేగం మండలం కొంచెవెల్లి లో 46.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా దాదాపుగా కొమురం భీం జిల్లాలోని అత్యధిక మండలాల్లో 45 డిగ్రీల పైగా నే ఉష్ణోగ్రతలు నమోదవుతు రెడ్అలర్ట్ జాబితాలో ఉంటున్నాయి. మరో వారం రోజులపాటు ఇదే రకంగా వేడి గాలులు ఉంటాయని రాష్ట్ర వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**అధికారులకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 25 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యప్రకాశ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిష్కరించి సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ ఫిర్యాదు తమ శాఖ పరిధిలోకి రాకపోతే సంబంధిత శాఖకు వెంటనే లేఖ రాసి పంపించాలని అధికారులకు తెలిపారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే వాటిని పై అధికారులకు పంపించడమో, లేదా ఏ నిబంధనల ప్రకారం పరిష్కారం సాధ్యం కాదో ఫిర్యాదు దారులకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.



ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 53 దరఖాస్తులు అందగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మరో 6 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలోచింపజేసిన.. పర్యావరణ పరిరక్షణ ప్రదర్శనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 25 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా జాతీయ హరితదళం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో బాగంగా భీమారం మండలం వెంకట్రావుపేట పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు, నాటికలు, చిత్రలేఖనం ఆలోచింప జేసే విధంగా ఉండి అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు జాతీయ హరిత దళం తరపున ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాతీయ హరితదళం కోఆర్డినేటర్, పర్యావరణ విద్యా అంబాసిడర్ మచ్చ రాజశేఖర్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, నీరు, విద్యుత్ పొదుపు చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలు




విద్యార్థులు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి విద్యార్థులచే ప్లాస్టిక్ వాడమని, చెట్లు నాటుతామని, పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి పల్లి స్వప్న మాట్లాడుతూ.. మా వంతు ప్రయత్నంగా ఊరిలో ఈ మధ్య జరిగే అన్ని ఫంక్షన్ లకు స్టీల్ ప్లేట్లు, గ్లాస్ లు వాడుతున్నమని గ్రామంలో అందరం కలిసికట్టుగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హరిత దళ ఇంచార్జీ గంగాధర్, ఉపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, రత్నాకర్, రాజమల్లయ్య, రాజేష్, కిషోర్, కనకయ్యలు పాల్గొన్నారు.

## పాలిసెట్, టీజీఐఆర్‌సెట్‌లో వనపర్తి విద్యార్థుల సత్తా...

**ప్రతిభావంతులను అభినందించిన ఎస్పీ సునిత రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 25 : వనపర్తి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాలిసెట్, టీజీఐఆర్‌సెట్-2026 ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విజ్డం అకాడమీ విద్యార్థులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా కష్టపడి చదివితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని ఈ విద్యార్థులు నిరూపించారని అన్నారు. విజయానికి క్రమశిక్షణ, తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల మార్గదర్శనం, విద్యార్థుల పట్టుదల ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం సాధించిన ర్యాంకులు విద్యార్థుల భవిష్యత్ విజయాలకు మొదటి అడుగేనని, ఇంకా ఉన్నత లక్ష్యాలతో




ముందుకు సాగాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, వ్యర్థ అలవాట్లకు దూరంగా ఉండి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రతి విద్యార్థిలో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎస్పీ కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుకూలి సంఘం జిల్లా మహాసభలను జయప్రదంచేయండి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 25 : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలో ఈనెల 31నసిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) అనుబంధ అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా మహాసభలకు రైతులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు కూలి సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చంద్రయ్య ఉపాధ్యక్షులు కొల్లూరిమల్లేష్ కోరారు. సోమవారం పార్టీ భవన్లో మహాసభల కరపత్రాలను అరిష్కరించి మాట్లాడారు. ఐకెపి సెంటర్ల వద్ద నిల్వ ఉన్న రైతుల ధాన్యాన్నియుద్ధ ప్రతిపాదికన తరలించి అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా అధికారులు ప్రజాప్రతినిధులు చూడాలని చంద్రయ్య మల్లేష్ డిమాండ్ చేశారు రైతులు పండించిన వరిధాన్యానికి మద్దతు ధర ప్రకటించి కేంద్రం కొనుగోలు నిధులను కేటాయించకపోవడం వలన రైతులు 600 నుంచి 800 రూపాయలు నష్టపోతున్నారని అన్నారు పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని విద్యుత్ చట్టం 2025ను రద్దు చేయాలని ఉపాధి కూలీల కోసం చేసిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వాలే రైతులకు బ్యాంకుల ద్వారా వ్యవసాయ పెట్టుబడులకు నిధులు అందించాలని కోరారు రైతుల సమస్యలపై చర్చించేందుకే వారి సమస్యల సాధన కోసం ఈ నెల 31న పెద్దం పేటలో తలపెట్టిన రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ ప్రారంభ ఉపన్యాసకులుగా సీనియర్ జర్నలిస్టు కోల లక్ష్మణ్ ప్రధాన వక్తలుగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి కోటేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న తదితరులు హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు ఈ కరపత్రాల విష్కరణలో ఏఐకేఎంఎస్ నాయకులు ఐ.రాజేశం గుండేటి మల్లేశం దోనూరి రాజమౌళి కే లింగమూర్తి పైడిపల్లి రమేష్ కోడిపుంజుల భూమేష్ గుండు రాజయ్య తుళ్ల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## కొండాపూర్‌లో 'దశాబ్ది సంపద వనాలు' నిధుల గోల్‌మాల్

**- కలెక్టర్ కు సీపీఐ, గ్రామ వికాస ఐక్యవేదిక నాయకుల ఫిర్యాదు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 25 : మేడి పెల్లి మండలం కొండాపూర్‌లో 'దశాబ్ది సంపద వనాలు' నిధుల గోల్‌మాల్ జరిగినట్లు సీపీఐ, గ్రామ వికాస ఐక్యవేదిక ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేసినట్లు సోమవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. దశాబ్ది సంపద వనాలు పథకం కింద కొండాపూర్‌లో ఎస్సారెస్పీ కాలువ ప్రక్కన రెండు చోట్ల నాటినట్లు రికార్డుల్లో చూపిన 846 మొక్కలకు గాను, క్షేత్రస్థాయిలో కేవలం 100 మొక్కలు మాత్రమే ఉన్నాయని, అందులోనూ కొన్ని ఎండిపోయే స్థితిలో ఉన్నాయని సీపీఐ, గ్రామ వికాస ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. నీటి వసతి, సంరక్షణ లేక మిగిలిన మొక్కలు ఎండిపోగా, 2025 లో రీప్లేస్‌మెంట్ పేరుతో రూ.లక్ష ఖర్చు చేసినట్లు బిల్లులు చూపించినా, ఒక్క మొక్క కూడా నాటలేదని వారు తెలిపారు. పంచాయితీరాజ్ చట్టం ప్రకారం పాలకమండలి తీర్మానం లేకుండానే ఈ పనులు చేశారని, ఇది నిధుల దుర్వినియోగమేనని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణం స్థల పరిశీలన, సమగ్ర విచారణ జరిపి నిధులు రికవరీ చేయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆరోపణలకు సంబంధించిన ఫొటోలు, డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కొండాపూర్ శాఖ కార్యదర్శి చెరుకూరి రాజేశం, గ్రామ వికాస ఐక్యవేదిక కార్యదర్శి ఎదలాపురం దుబ్బరాజం, అధ్యక్షులు పిట్టల నారాయణ, మాజీ జిల్లా కార్యదర్శి ఎద్దండి భూమయ్య, మాజీ శాఖ కార్యదర్శి రాంపల్లి రవి, కార్యవర్గ సభ్యులు పారకొండ గంగాధర్, పారకొండ వెంకటేష్, మరిపెల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో ప్రజలకు భరోసా...

**- ఎస్పీ సునిత రెడ్డి - ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 25 :ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి ఆమె నేరుగా వినతులు స్వీకరించారు. ఫిర్యాదు దారులు వివరించిన సమస్యలను ఓర్పుతో విన్న ఎస్పీ, ప్రతి ఫిర్యా దును స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారు లతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు వేగంగా న్యాయం అందేలా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని ఎస్పీ తెలిపారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తూ, చట్టపరమైన రీతిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ తీరు పట్ల ఫిర్యాదు దారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ సమస్యలకు న్యాయం జరుగు తుందనే నమ్మకం కలిగిందన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో 03 భార్యాభర్తల వివాదాలు, 04 భూ వివాదాలు, 04 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

## స్త్రీ వారోత్సవాల్లో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 25 : ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని గంగపుత్ర భవన్ లో స్త్రీ వారోత్సవాల్లో భాగంగా న్యూట్రిషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, కుకింగ్ పోటీలు, ఏఎంసీ చెకప్, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలతో మాట్లాడుతూ, ఏఎంసీ చెకప్ గురించి వివరాలు అడిగి తెలుసుకుని అందుతున్న వైద్య సేవల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలని అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ వినియోగించుకొని జంక్ ఫుడ్ ను తగ్గించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమం లో కుకింగ్ పోటీలు నిర్వహించారు, దీనిలో పాల్గొన్న మహిళలను అభినందించారు.




## గ్రామైక్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 25 : మేడి పెల్లి మండలం కాచారం గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి 10 లక్షల రూపాయల వ్యయంతో గోదాం సమీపంలో నిర్మించనున్న జ్యోతి గ్రామైక్య సంఘ భవనానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ భవనం మహిళా సంఘాల అభివృద్ధికి, సమావేశాలు, సామాజిక కార్యక్ర మాల నిర్వహణకు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల హైమావతి సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చిట్యాల సురేష్, చేపూరి నాగరాజు, గ్రామ మహిళా సంఘ సభ్యులు, గ్రామ కుల సంఘాల పెద్దలు, గ్రామస్థులు, గ్రామ యువత పాల్గొన్నారు.



# రుద్రాక్షపల్లిలో ఉపాధి హామీ కూలీలకు మెడికల్ కిట్ల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 25:ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూలీల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన సహాయ సామగ్రిని అందజేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఉపాధి హామీ కూలీలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్ పాయం నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో కూలీలకు మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు, టిఫిన్లు పంపిణీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీల ఆరోగ్య రక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఘన సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 25:జయశంకర్–భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ సరిత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ మంచి మార్కులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు తేజస్విని, శ్రావణి, దేవిక, మనక్క, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లికి గోదావరి జలాలే లక్ష్యం

**- యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 25:సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి జలాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేస్తున్నారని స్థానిక రైతులు అభిప్రాయపడుతున్నారు. “తాను ఎక్కడ ఉన్నా, ఏ నియోజకవర్గంలో ఉన్నా మొదటి ప్రాధాన్యత సత్తుపల్లికే” అని ప్రజల్లో చెబుతున్న మాటలను మంత్రి మరోసారి కార్యరూపంలో చూపించారు. ఈ నేపథ్యంలో సోమవారం సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పరిశీలించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ట్రాక్టర్ నడుపుకుంటూ పనుల ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం యాతాలకుంట గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అధికారులతో చర్చించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సత్తుపల్లి ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో మంత్రి తుమ్మల ముందుకు సాగుతున్నారని రైతులు పేర్కొన్నారు. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భావితరాలకు ఇది గొప్ప వరంగా నిలుస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా మంత్రి తుమ్మల చేపడుతున్న చర్యలు అభినందనీయమని పలువురు నాయకులు, రైతులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాలి దుమారానికి చెదిరిన నిరుపేద గూడు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 25: ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని వడమర లోకారం గ్రామంలో సోమవారం సాయంత్రం వీచిన భారీ గాలి దుమారం ఓ నిరుపేద కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. గ్రామానికి చెందిన భూక్య నాగమణి నివాస గృహం పైకప్పు బలమైన ఈదురుగాలులకు పూర్తిగా ఎగిరిపడి నేలమట్టమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రి వర్షానికి తడిసి పాడైపోయినట్లు కుటుంబ సభ్యులు వాపోయారు. నివాసం దెబ్బతినడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ - వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచన**

**- అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని హెచ్చరిక**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 25:జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ఈమేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పలు జాగ్రత్తలను వివరించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నందున ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యవస రమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచిం చారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు,అనారోగ్యంతో బాధపడు తున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండటంతో ప్రజలు తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అలాగే పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటి రక్షణ చర్యలు తీసుకోవాలని, పలుచటి లేత రంగు దుస్తులు ధరించాలని సూచించారు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలని పేర్కొన్నారు. భారీ భోజనాలు, మద్యం, కాఫీ వంటి డీహైడ్రేషన్‌కు కారణమయ్యే పానీయాలను నివారించాలని, చిన్నపిల్లలు మరియు వృద్ధులను ఎండలో ఎక్కువసేపు ఉంచవద్దని హెచ్చరించారు. అలాగే పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలి పెట్టవద్దని తెలిపారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో శరీరాన్ని తడపాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వడంతో పాటు అవసరమైతే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విజ్ఞప్తి చేశారు.

# వెంకటాపురంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మే 25:ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు వేసవి తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాల వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధు లక్ష్మి కూలీలకు స్వయంగా మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మండుతున్న ఎండల్లో రోజంతా శ్రమిస్తున్న కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూలీలు అలసట, దాహం, వడదెబ్బ వంటి సమస్యలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారికి తాగునీరు, మజ్జిగ వంటి శీతల పానీయాలు అందించడం ద్వారా కొంత ఉపశమనం కలిగించవచ్చని అన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, కూలీల ఆరోగ్య పరిరక్షణ తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ సాధు లక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వేసవి కాలం ముగిసే వరకు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాల వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. గ్రామంలో పేదలు, కూలీలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాల గంగాధర రెడ్డి,మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు,సాధు అర్జున్ గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలకు నీలాద్రి దేవాలయ కమిటీ ఘన సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 25:భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం నీలాద్రి దేవాలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఘనంగా సన్మానించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలంలో ప్రసిద్ధి చెందిన నీలాద్రి స్వామి దేవాలయ అభివృద్ధికి మంత్రి తుమ్మల చేసిన కృషికి కృతజ్ఞతగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నీలాద్రి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కోరిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి చొరవతో దేవాలయ అభివృద్ధి కోసం టీటీడీ రూ.3 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే గతంలో కూడా దేవాలయ అభివృద్ధి కోసం రహదారులు, విద్యుత్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో మంత్రి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నీలాద్రి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదవ రోజుకు చేరుకున్న సరస్వతి అంత్య పుష్కరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 25:సరస్వతి అంత్య పుష్కరాలు సోమవారంతో ఐదో రోజుకు చేరుకున్న సందర్భంగా కాళేశ్వరానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పుణ్యనదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీ కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భక్తుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే భక్తులు అధికారులకు సహకరిస్తూ సూచనలు పాటించాలని, క్రమశిక్షణతో పుష్కర స్నానాలు నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా అస్వస్థతకు గురైతే వెంటనే 108 సేవలను సంప్రదించాలని, అత్యవసర వైద్య కేంద్రాల్లో చికిత్స పొందాలని తెలిపారు.



# నేతకాని సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 25:మండల కేంద్రంలోని గంటగూడెం గ్రామానికి చెందిన బౌతు సారక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె దశదినకర్మ సందర్భంగా సోమవారం నేతకాని సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన సారక్క చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించడం తమ బాధ్యత అని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని సేవ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గంట దేవదాస్, ఉపాధ్యక్షులు గాలి సదువలి, కార్యదర్శి డొంగిరి రవి, బీరెల్లి చిన్నరాజయ్య, సలహాదారులు గజ్జల రాజేందర్, గంట సమ్మయ్య, గౌరవ అధ్యక్షులు కొండ గొర్ల బానయ్య, కొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో రోడ్డు ప్రమాదం.. హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 25:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి మృతి చెందారు. నవభారత్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో అశ్వాపురం మండలం మొండికుంట ప్రాంతంలోని హెవీ వాటర్ ప్లాంట్‌లో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రభాత్ కుమార్ (55)తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ సహాయంతో గాయపడిన వారిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ప్రభాత్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభాత్ కుమార్ మృతితో కుటుంబ సభ్యులు, సహోద్యోగుల్లో విషాదం నెలకొంది.



# ఉపాధి పనికి వెళ్లిన తల్లి... వీధి కుక్కల దాడిలో విషాదాంతం

## - చికిత్స జరుగుతుండగానే మృతి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 25:కుటుంబాన్ని పోషించేందుకు అరవై ఏళ్ల వయసులోనూ ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఓ నిరుపేద మహిళ జీవితం విషాదాంతమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ గ్రామంలో జరిగిన ఈ ఘటన ప్రతి ఒక్కరి మనసును కలిచివేసింది. గ్రామానికి చెందిన మారే రాములమ్మ (60) సోమవారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రెండు వీధి కుక్కలు ఆమెపై ఒక్కసారిగా దాడి చేశాయి. కుక్కలు విచక్షణారహితంగా కరచడంతో ఆమె తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. అక్కడున్న యువకులు పరుగెత్తుకుంటూ వచ్చి కుక్కలను తరిమికొట్టినా అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. తీవ్ర గాయాలతో ఉన్న రాములమ్మను హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స అందకపోవడంతో అనంతరం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఆమె కన్నుమూసింది. రాములమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులంతా కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నాలుగు నెలల క్రితమే ఆమె భర్త మృతి చెందడంతో కుటుంబ భారం మొత్తం ఆమె భుజాలపై పడింది. వయసు పైబడినా కుటుంబం గడవాలనే ఆందోళనతో ప్రతిరోజూ ఉపాధి పనులకు వెళ్లేదని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. "పొద్దున్నే పనికి వెళ్లిన అమ్మ ఇలా శవంగా వస్తుందని ఊహించలేదు" అంటూ కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల సమస్యపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.. ఇద్దరికి గాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, మే 25:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం వినపాక-మణుగూరు సరిహద్దుల్లోని చిక్కుడుగుంట బీటీపీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. మణుగూరు మండలం శేషగిరినగర్‌కు చెందిన వృతిక్ (20) తన స్నేహితులతో కలిసి స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి కల్వర్ట్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాదంలో వృతిక్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీపై మరో ఇద్దరు యువకులు కూడా ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వారిని స్థానికులు అంబులెన్స్ సహాయంతో మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో శేషగిరినగర్‌లో విషాద వాతావరణం నెలకొంది.

# ప్రకాశం ఖని ఓసీ-4లో దుమ్ము ధూళి నివారణతో పాటు సమస్యలు పరిష్కరించాలి

## మేనేజర్ కు వినతి పత్రం అందజేసిన టిబిజికేఎస్ నాయకులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 25:భద్రాద్రి జిల్లా సింగరేణి మణుగూరు ఏరియా ప్రకాశం ఖని ఓసీ-4లో తీవ్ర దుమ్ము, ధూళి కాలుష్యం కార్మికులు, అధికారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని, డస్ట్ కంట్రోల్ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నాయకులతో కలిసి గని యాక్టింగ్ మేనేజర్ కె. వినోద్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గని ఫిట్ సెక్రటరీ నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలను ప్రస్తావించారు. గనిలో సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, జనరల్ అసిస్టెంట్ల కొరతతో కార్మికులపై పనిభారం పెరిగి రక్షణ నిబంధనల ఉల్లంఘనకు దారి తీస్తోందని, సరిపడా మ్యాన్‌పవర్ ఏర్పాటు చేయాలని కోరారు. కన్వేయన్స్ వాహనాల కొరత, ఫిట్‌నెస్ లేమితో కార్మికులు సమయానికి పనిస్థలాలకు చేరుకోలేకపోతున్నారని తెలిపారు. సర్వే విభాగ కార్మికులను సరైన సౌకర్యాలు లేని ప్రైవేట్ వాహనాల్లో తరలించడం వల్ల ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నాలుగు ఫ్రిజ్‌లలో ఒకటి మాత్రమే పనిచేస్తోందని, క్యాప్ లాంపులు, వైర్లెస్ సెట్లు సరిగా పనిచేయక సెకండ్ నైట్ షిఫ్ట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లెట్రిన్ ట్యాంకులు నిండి దుర్వాసన వస్తోందని, పరిశుభ్రత లోపంతో కార్మికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నాణ్యమైన డస్ట్ కంట్రోల్ మాస్కులు అందించి, కార్మిక గదుల్లో దుమ్ము ధూళిని తొలగించాలని కోరారు. కార్మికుల ఆరోగ్యం కాపాడితేనే సంస్థ ప్రగతి సాధ్యమని, సమస్యల పరిష్కారానికి కార్పొరేట్ మరియు స్థానిక యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వనమా రామకృష్ణ, ధారావత్ కృష్ణ, థామస్, కె. రమేష్ బాబు, వీరబాబు, శ్రీనివాస్, నవీన్ కుమార్, వినీత్ కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

# కోడిసెలకుంటలో అగ్ని ప్రమాదం... అప్రమత్తమైన గ్రామస్తులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 25:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడి గ్రామపంచాయతీ పరిధిలోని కోడిసెలకుంట గ్రామంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం త్రుటిలో తప్పింది. గ్రామం అవతల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా గ్రామం వైపు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గాలి వేగం ఎక్కువగా ఉండటంతో మంటలు మరింత ఉద్ధృతంగా మారి గ్రామం దిశగా దూసుకువచ్చాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై బకెట్లు, మోటార్ల సహాయంతో నీరు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. గ్రామస్తుల సమయస్ఫూర్తి, ఐక్యత వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మంటలు మరింత వ్యాపించి ఉంటే గ్రామంలోని ఇళ్లు, పశువులు, వ్యవసాయ భూములకు భారీ నష్టం వాటిల్లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 25:ప్రజలు సమర్పిస్తున్న వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన కంచపోగు సురేష్ తన కుమారుడు అభిషేక్‌కు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో సీటు కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిపై జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారికి సూచనలు జారీ చేస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం అల్లిపురం గ్రామానికి చెందిన పి. భవాని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, సంబంధిత హౌసింగ్ అధికారికి దరఖాస్తు పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామానికి చెందిన ఆంజనేయులు తమ కుటుంబ భూమికి సంబంధించిన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సర్వే నెంబర్ 30లోని భూమిలో కొంతభాగం ఇతరుల పేరుపై పట్టా అయిందని, దానిని రద్దు చేసి తమ భూమి తిరిగి ఇప్పించాలని కోరారు. దీనిపై సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు పంపిస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

## కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్లు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 25:రోహిణి కార్తె ప్రారంభమైన సందర్భంగా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫ్రెండ్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి వచ్చిన రోగులు, పాదచారులకు సుమారు 200 లీటర్ల మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేటర్లు అడుసుమల్లి సాయిబాబా, గుర్రం వెంకటేశ్వర్లు (47వ డివిజన్), సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథరావు, మీసంశెట్టి పూర్ణచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ కృష్ణ, యాకయ్య, పునుకుల నాగేశ్వరరావు, ఆసిఫ్, రాము, విజయభాస్కర్, రహీముద్దీన్, కోచ్ అఫ్జల్, ప్రసాద్, శివ, నాగరాజు, సురేష్, బ్యాంకు నాగేశ్వరరావు, థామస్, రవి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది మొహిజుద్దీన్ హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 25:తెలంగాణ హైకోర్టు న్యాయవాది మొహిజుద్దీన్ హత్యను నిరసిస్తూ మణుగూరు కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. న్యాయవాదిపై జరిగిన హత్యను ఖండిస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు.

# చిన్నారులకు పోషకాహారం అందించడమే అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యం

## - జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ - "సే నో టు జంక్ ఫుడ్" నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్ ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జయశంకర్-భూపాలపల్లి, మే 25:ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు సమతుల్యమైన, పోషక విలువలు గల ఆహారం అందించి వారి బాల్యాన్ని బలోపేతం చేయడం అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో తొలి రోజు సోమవారం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "సే నో టు జంక్ ఫుడ్" అనే నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, ఇతర పోషకాహార పదార్థాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. స్టాల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ వంటకాల తయారీ విధానం, వాటి ఆరోగ్య ప్రయోజనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మహిళా ఉన్నతి -- తెలంగాణ ప్రగతి" అనే నినాదంతో ఈ నెల 30వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన, సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మార్కెట్‌లో లభించే జంక్ ఫుడ్‌ను చిన్నారులకు దూరంగా ఉంచి, స్థానికంగా అందుబాటులో ఉన్న తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలతో తయారుచేసిన పోషకాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ దిశగా అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళలు, చిన్నారుల కోసం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు, టీచర్లు, పిల్లల తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల్లో ఆకట్టుకుంటున్న ఉచిత ఎగ్జిబిషన్

## - చిన్నారులను అలరిస్తున్న ఆటవస్తులు, వినోద కార్యక్రమాలు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 25:సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తులు, వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పుష్కరాలకు కుటుంబాలతో కలిసి విచ్చేస్తున్న చిన్నారులు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆటవస్తువులతో ఉల్లాసంగా గడుపుతున్నారు. ఈ వినోద కార్యక్రమాలు పిల్లలకు ఆనందాన్ని పంచడమే కాకుండా పుష్కరాల సందడిని మరింత ఆహ్లాదకరంగా మారుస్తున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ చిన్నారుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు కుటుంబ సభ్యులందరికీ వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తులు ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా సందర్శిస్తూ నిర్వాహకులను అభినందిస్తున్నారు.

# సరస్వతి పుష్కరాలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## పుష్కరాల ఏర్పాట్లపై భక్తులను స్వయంగా అడిగిన కలెక్టర్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 25: సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం సరస్వతి ఘాట్ వద్ద భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్‌తో పాటు అత్యవసర వైద్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, భక్తులతో కలిసి ఫోటోలు దిగారు. పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలను తప్పక వీక్షించాలని భక్తులకు సూచించారు. అనంతరం ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ వైద్యులతో మాట్లాడారు. అత్యవసర సేవల కోసం వచ్చే భక్తులకు తక్షణమే చికిత్స అందించి, పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే పంపించాలని వైద్యులకు ఆదేశించారు. అలాగే పుష్కరాలకు విచ్చేసే ప్రతి భక్తునికి ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్న కలెక్టర్, ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడికి వచ్చే భక్తులకు శిలా సంపద ప్రాముఖ్యతపై సమగ్ర సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, దేవాదాయ శాఖ డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వికాసమే ప్రభుత్వ ధ్యేయం

## ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు సాధించాలి

## కోల్‌బెల్ట్ సమస్యలపై ప్రతి 15 రోజులకు సమీక్ష

## మంత్రులు, ఎమ్మెల్యేలతో డిప్యూటీ సీఎం భట్టి ఉన్నతస్థాయి సమావేశం




(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, మే 25 : ప్రస్తుత పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు సాధించడం అత్యవసరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యానికి సూచించారు. తక్కువ ధరకే అధిక నాణ్యత గల బొగ్గు ఉత్పత్తి చేసే కొత్త బ్లాకుల సాధనపై దృష్టి సారించాలని, మార్కెట్లో నాణ్యమైన బొగ్గు విక్రయాల ద్వారా సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన సింగరేణి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఎనర్జీ స్పెషల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, జీఏడీ డైరెక్టర్ గౌతమ్ పొట్రు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎంపీ బలరాం నాయక్‌తో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణకు కొంగుబంగారంగా నిలిచిన సింగరేణితో పాటు కోల్‌బెల్ట్ ప్రాంత సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత పదేళ్లలో కొత్త బ్లాకుల సాధనలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించిన ఆయన, 100 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని తెలంగాణ ప్రభుత్వం ఒడిశా వరకు విస్తరించేలా చర్యలు చేపట్టిందన్నారు. కొత్త బ్లాకుల సాధనతో పాటు నాణ్యమైన బొగ్గు విక్రయాల ద్వారానే సంస్థ భవిష్యత్తును భద్రపరచగలమని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో కోల్‌బెల్ట్ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యేలు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న సూచనలు, విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించాలని భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల విజ్ఞాపనలపై తీసుకున్న చర్యలను సమీక్షిస్తామని ప్రకటించారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికులు, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకలు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, వేదిక అలంకరణ, కుర్చీలు, ధ్వని వ్యవస్థ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గృహ సహాయకుల వివరాలు పోలీసులకు ఇవ్వాలి

## నేరాల నియంత్రణకు ప్రత్యేక సర్వే : పోచారం సీఐ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్కేసర్, మే 25 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చౌదరిగూడ-కార్తికేయ ఎంక్లేవ్‌లో సోమవారం రాత్రి కాలనీ వాసులకు నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం సీఐ కనుకయ్య గౌడ్ మాట్లాడుతూ, ఇటీవల దేశంలో, రాష్ట్రంలో గృహ సహాయకుల ద్వారా చోటుచేసుకున్న కొన్ని దోపిడీ, హత్య ఘటనలను ప్రస్తావించారు. ఐపీఎస్ అధికారి వినయ్ కుమార్ ఆప్టే కుటుంబంలో పనిచేసిన నేపాలీ గ్యాంగ్ హత్య చేసి ఆస్తులు దోచుకెళ్లిన ఘటనతో పాటు, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధులను బంధించి దోపిడీ చేసిన సంఘటనలను గుర్తుచేశారు. ఈ ఘటనల నేపథ్యంలో మల్కాజిగిరి కమిషనరేట్ కమిషనర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు గృహ సహాయకులు, డ్రైవర్లు, గార్డెనర్లు తదితర డొమెస్టిక్ హెల్పర్ల పూర్తి వివరాలను సేకరించే ప్రత్యేక సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా వారి వివరాలను పోలీస్ డేటాబేస్‌లో భద్రపరుస్తామని, భవిష్యత్తులో ఏదైనా నేరం జరిగితే నిందితులను త్వరగా గుర్తించి పట్టుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే పోలీసుల వద్ద తమ వివరాలు ఉన్నాయనే భయంతో కొందరు నేరాలకు పాల్పడకుండా ఉండే అవకాశ మూ ఉంటుందని చెప్పారు. గత వారం రోజులుగా పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వ హిస్తున్న ఈ సర్వేలో ఇప్పటివరకు సుమారు 500 మంది గృహ సహాయకుల వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీల్లోకి వెళ్లి పోలీసులు ఈ సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. కాలనీవాసులు తమ ఇళ్లలో పనిచేస్తున్న మేడ్ సర్వెంట్లు, డ్రైవర్లు, ఇతర సహాయకుల వివరాలను పోలీసులకు అందించాలని కోరారు. అదేవిధంగా ప్రత్యేక లింక్, స్కానర్ ద్వారా ప్రజలు స్వయంగా కూడా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇందులో ఫొటో, ఆధార్ కార్డు, గుర్తింపు పత్రాలు, బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజల భద్రత కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్లు సీఐ వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పోచారం ఎస్ఐలు ఎస్. కృష్ణయ్య, నాగార్జున రెడ్డిలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : భద్రాద్రి జిల్లా ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సమగ్రం గా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి శ్రీరామ్ పాల్గొన్నారు. జిల్లా లోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతా యుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ వాహనాల పాత విడిభాగాలకు ఈనెల 30న బహిరంగ వేలం పాట

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖకు చెందిన పాత వాహన విడిభాగాలకు ఈనెల 30న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఓ. సుధాకర్ రావు తెలిపారు. జిల్లా ఎస్పీరోహిత్ రాజు ఆదేశాల మేరకు హేమచంద్రపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, పాత బ్యాటరీలు, ఇతర వాహన విడిభాగాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటలకు హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవాలని సూచించారు. వేలం పాటకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎంటీవో ఫోన్ నెంబర్ 8712682145ను సంప్రదించాలని తెలిపారు.

# మీసేవ సేవల ధ్రువీకరణకు భౌతిక పత్రాలు అవసరం లేదు

## భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

## ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన పత్రాలనే పరిశీలించాలని సూచన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మీసేవ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు సులభత రంగా అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవల ధృవీకరణ కోసం ప్రత్యేక మొబైల్ అనువర్తనం అమల్లో ఉన్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా సంబంధిత అధికారులు మీసేవ దరఖాస్తు వివరాలు, ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన పత్రాలను పరిశీలించి అర్హత ఆధారంగా ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో మీసేవ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రజల నుండి ఎలాంటి భౌతిక పత్రాలను స్వీకరించరాదని స్పష్టం చేశారు. మండల, గ్రామ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు కూడా భౌతిక పత్రాలను కోరరాదని సంబంధిత కార్యాలయం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు మీసేవ దరఖాస్తులకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన అనంతరం ఎలాంటి భౌతిక పత్రాలను అధికారులకు లేదా సిబ్బందికి అందజేయవద్దని సూచించారు జిల్లా పరిపాలన ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మీసేవ సేవలకు సంబంధించిన సమస్యలు ఎదురైనట్లయితే సంబంధిత మండల అధికారులను లేదా జిల్లా మీసేవ నిర్వాహకులను సంప్రదించాలని సూచించారు. అలాగే కృష్ణమూర్తి-9133122022, రాకేష్ - 9000420792, ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు - 7337340825 లను కూడా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు భద్రాద్రి జిల్లా క్రీడాకారుల ఎంపిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలోని అంబేద్కర్ ఐటీఐలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ సెలక్షన్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 92 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐ ఇంద్రసేనారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, లెక్కల సామర్థ్యం, సహనం పెంపొందిస్తుందని, భవిష్యత్తులో విద్యా రంగంతో పాటు జీవితంలోనూ విజయాలను సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. అంబేద్కర్ ఐటీఐ డైరెక్టర్ కే. వేలన్ కుమార్ మాట్లాడుతూ ప్రతినెలా చెస్ పోటీలు నిర్వహించేందుకు తమ సంస్థలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ గోపీకృష్ణ మాట్లాడుతూ వచ్చే నెలలో అండర్-13, అండర్-15 విభాగాల్లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-9 బాలికల విభాగం నుండి ఏ. ఆర్నాధన్వి, మహిషా గాయత్రి, అండర్-9 బాలుర విభాగం నుండి శ్రీ విహాన్, హితేష్ అలాగే అండర్-17 బాలికల విభాగం నుండి జి. హర్షిత, అద్వైత ప్రదీక్ష, అండర్-17 బాలుర విభాగం నుండి బి.తనీష్, నిహాల్ కార్తికేయన్ లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ గోపీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఐటీఐ డైరెక్టర్ కే. వేలన్ కుమార్, జిల్లా చెస్ అసోసియేషన్ ట్రెజరర్ రంజిత్ రాజు, రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు జ్యోత్స్న, ఆర్బిటర్లు అన్వర్, బిశ్వజిత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల ఒక్కరోజు సమ్మె వాయిదా

## ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో నిర్ణయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : రాష్ట్రవ్యాప్తంగా మే 28న నిర్వహించాలని నిర్ణయించిన ప్రజారోగ్య మరియు వైద్య ఉద్యోగుల ఒకరోజు టోకెన్ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (రిజి. నెం. 3194), ఐఎన్‌టీయూసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్ యూనియన్ హక్కుల పరిరక్షణ, జీఓ ఎంఎస్ నెం.38 ప్రకారం పారదర్శక బదిలీలు, ఎంపీహెచ్‌ఏ (ఏఎఫ్) ఉద్యోగులకు ఎల్.హెచ్.వి. శిక్షణ లేకపోవడంతో నిలిచిపోయిన రెండు ఇంక్రిమెంట్ల మంజూరు, పెండింగ్ వేతనాల విడుదల, రిటైర్మెంట్ బకాయిల చెల్లింపు, రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్, ఎంపీహెచ్‌ఏ (ఎం) ఉద్యోగుల వేతనాల పెంపు, మరణించిన వీఆర్‌ఏల స్థానాల్లో నియామకాలు తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ యూనియన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ డిమాండ్లపై గౌరవ ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి మే 14న సమ్మె నోటీసు ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం అదనపు కార్మికశాఖ కమిషనర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మే 21న ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. కొన్ని డిమాండ్లపై మరింత చర్చించేందుకు సమావేశాన్ని మే 29కు వాయిదా వేసినట్లు తెలిపారు. చర్చలు సానుకూల దిశగా కొనసాగుతున్న నేపథ్యంలో మే 28న చేపట్టాల్సిన టోకెన్ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని కొత్తగూడెం జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గొంది వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జి. ఉమాదేవి సంయుక్తంగా తెలిపారు.

# వడదెబ్బతో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 25 : వడదెబ్బ ప్రభావంతో బిజెపి ములుగు మండల మాజీ అధ్యక్షుడు అన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి (49) మృతి చెందారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయనను ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణిం చాడు. సోమవారం బీజేపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో పార్థివదేహానికి పూలమాల వేసి,బీజేపీ పార్టీ జెండాని కప్పి నివాళులు అర్పించారు.ప్రమోద్ రెడ్డి మరణం పార్టీకి తీరని నష్టం కలిగించిందని,వారి సేవలను గుర్తు చేసుకొని పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వరూప,రాష్ట్ర నాయకులు నరహరి వేణుగోపాల్ రెడ్డి,నాగపురి రాజమౌళి గౌడ్,రావుల కిషన్ రావు,చింతలపూడి భాస్కర్ రెడ్డి, సూర్యనేని సురేష్,దొంతు రెడ్డి వాసుదేవ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్దినేని తేజ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరం రమేష్, పట్టణ అధ్యక్షుడు రాకేష్ యాదవ్,జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో పండగలు జరుపుకోవాలి

## సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేష్

## మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసిన సీపీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




శేరిలింగంపల్లి, మే 25 : శాంతియుత వాతావరణంలో ప్రజలంతా పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ,, ప్రజలంతా పండుగలను మతసామరస్య వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మత పెద్దలు, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారని, ఎవరైనా గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ పరిధిలోని వివిధ మత పెద్దలు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు లో వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు గత 45 రోజులుగా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోందని సీపీ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాపించే ఫేక్ న్యూస్, పాత వీడియోలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరి సహకారంతో పండుగలను చట్టపరంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని, సమాజంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాలంటీర్లు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో సహకరించాలని కోరారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీ హెచ్. శ్రీనివాస్, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్ బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి సైబరాబాద్ పరిధి లో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, పలువురు హిందూ, ముస్లిం మత పెద్దలు మరియు నాయకులు పాల్గొన్నారు.

# మైలారంలో అటవీ శాఖ తనిఖీలు.. రెండు ట్రాక్టర్లు సీజ్.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ వన్యప్రాణి సంరక్షణ రేంజ్ పరిధిలోని మైలారంలో అటవీ శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా కలప తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేశారు. సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కలప లోడ్‌తో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అధికారులు గుర్తించి పట్టుకున్నారు. అక్రమంగా చెట్లు నరికి తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లలో ఒకదాన్ని డీఎఫ్‌వో కార్యాలయానికి, మరొకదాన్ని మైలారం అటవీ కార్యాలయానికి తరలించిన అధికారులు అటవీ చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సినిమా న్యూస్



# 90 స్ డేస్ లోకి వెళ్లిపోయిన అందాల నటి!



90ల నాటి బాలీవుడ్ చిత్రాలలో గోవిందా- కరిష్మా కపూర్ కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. ఇద్దరి కలయికలో రిలీజ్ అయిన -కూలీ నెం. 1- (1995) అప్పట్లో ఎంతటి భారీ విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమాలోని -హుస్న్ హై సుహానా- అనే ఐకానిక్ డ్యాన్స్ నంబర్ ఇప్పటికీ ఎంతో మంది అభిమానులను ఊపేస్తూనే ఉంది. తాజాగా ఓ రియాలిటీ షోలో పాల్గొన్న కరిష్మా కపూర్ ఆ పాట చిత్రీకరణ సమయంలో తాను ఎదుర్కొన్న ఒత్తిడిని, ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. -ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్- రియాలిటీ షో ప్రీమియర్ ఎపిసోడ్‌కు కరిష్మా కపూర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఒక కంటెస్టెంట్ -హుస్న్ హై సుహానా" పాటకు అద్భుతమైన నృత్య ప్రదర్శన చేయడంతో కరిష్మా ఒక్కసారిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆ పాట షూటింగ్ సమయంలో తాను విపరీతమైన ఆందోళనకు, కంగారుకు లోనయ్యానని బహిరంగంగా వెల్లడించారు. ఆ సమయంలో తన వయస్సు 17 లేదా 18 ఏళ్లు మాత్రమేనని, ఆ వయస్సులో ఇండస్ట్రీలోనే టాప్ పెర్ఫార్మర్ అయిన గోవిందా వంటి స్టార్ హీరోతో కలిసి డ్యాన్స్ చేయాల్సి రావడం పెద్ద బాధ్యతగా అనిపించిందని కరిష్మా చెప్పారు. స్క్రీన్‌పై గోవిందా ఇచ్చే ఎనర్జీని అందుకోవడం, ఆయన టైమింగ్‌కు మ్యాచ్ చేయడం అనేది ఒక నూతన నటికి ఎంతో సవాలుతో కూడుకున్న విషయమని ఆమె పేర్కొన్నారు. ఆ ఎనర్జీని మ్యాచ్ చేయడమే తన భయానికి ప్రధాన కారణమని వివరించారు. గోవిందాతో కలిసి నటించడమే కాకుండా ఆ పాటతో మరో కొత్త కలయిక కూడా తోడైందని కరిష్మా తెలిపారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య మాస్టర్‌తో ఆమెకు అది మొదటి లేదా రెండవ పాట. అటు హీరో గోవిందాతో సరిసమానంగా చేయాలి. ఇటు కొత్త కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య కంపోజిషన్‌ను సరిగ్గా ప్రెజెంట్ చేయాలి. అందుకే ఆ కాంబినేషన్ తనకు ఎంతో కొత్తగా ఒత్తిడితో కూడుకున్నదిగా అనిపించిందని కరిష్మా గుర్తుచేసుకున్నారు. అయితే సెట్స్‌లో తన భయాన్ని పోగొట్టడానికి దర్శకుడు డేవిడ్ ధావన్ ఎంతో సహాయం చేశారని కరిష్మా కపూర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. షూటింగ్ సమయంలో కరిష్మా దగ్గరకు వచ్చిన డేవిడ్ ధావన్.. ఆయన (గణేష్ ఆచార్య) ఎంతో ప్రతిభావంతుడైన కొత్త మాస్టర్- అని పరిచయం చేస్తూ ధైర్యం చెప్పారు. ఆ సమయంలో కరిష్మా ఎంత సిగ్గుపడుతూ కూర్చున్నారో, మాస్టర్ గణేష్ ఆచార్య కూడా అంతే మొహమాటపడుతూ ఉన్నారని ఆ తర్వాత చిత్రబృందం అంతా కలిసి వారిద్దరికీ ఐటమ్ సాంగ్ ప్రాముఖ్యతను, గోవిందాతో ఎలా డ్యాన్స్ చేయాలో వివరించి కంఫర్టబుల్‌గా మార్చారని తెలిపారు. ఆ విధంగా అందరి ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న ఆ పాట నేటికీ ఎవర్‌గ్రీన్ చార్ట్‌బస్టర్‌గా నిలిచిపోయింది. మూడు దశాబ్దాలు దాటినా ఈ పాటకున్న క్రేజ్ తగ్గకపోవడం విశేషం.

# అలా చూడటం అలవాటు చేస్కోండి.. మగ బుద్ధిపై క్వీన్ క్లాస్!







ఫ్రెంచ్ రివేరా వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక కాన్స్-2026 చలనచిత్రోత్సవంలో గ్లోబల్ ఐకాన్ ఐశ్వర్యా రాయ్ బచ్చన్ తన అద్భుతమైన లుక్స్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లూ కస్టమ్ స్కల్ప్చరల్ గౌన్ నుండి ఫెదర్ స్టోల్‌తో కూడిన వైట్ ప్యాంట్ సూట్ వరకు.. ఐసూ ధరించిన ప్రతి అవుట్‌ఫిట్ రెడ్ కార్పెట్‌పై ప్రత్యేకంగా నిలిచింది. మెజారిటీ నెటిజన్లు మాజీ ప్రపంచ సుందరి స్టైల్‌కు ఫిదా అవుతుంటే.. కొందరు సోషల్ మీడియా యూజర్లు మాత్రం తన వయసు, బరువును టార్గెట్ చేస్తూ -ఏజ్-షేమింగ్- కు దిగారు. వయసుపైబడిన లుక్‌లో కనిపిస్తోందంటూ కొందరు చేసిన ఈ విమర్శలు బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, నటి కంగనా రనౌత్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి.

ఐశ్వర్యను ట్రోల్ చేస్తున్న వారికి కంగనా రనౌత్ తన ఇన్‌స్టా లో గట్టి క్లాస్ తీస్కున్నారు. కాన్స్ రెడ్ కార్పెట్‌పై బ్లూ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతున్న ఐశ్వర్య ఫోటోను షేర్ చేస్తూ కంగనా ఒక ఘాటు నోట్ రాశారు. --ఫ్యాషన్- స్టైల్ అనేవి ఎవరికి వారు వ్యక్తపరిచేవి. అది జీవితంపై ఒకరి దృక్పథాన్ని.. వారి వైఖరిని ప్రతిబింబిస్తుంది. ఏ మహిళ కూడా ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. ఐశ్వర్య అద్భుతంగా ఉంది! ఆమెను వేరే విధంగా చూడాలనుకునే వారు.. మొదట మీరేంటో చూపించండి. ఆమె ఇక్కడ ఎవరినో సంతోష పెట్టడానికి లేదు... ఆమె ఎప్పటికీ గ్లోరియస్. ఒకవేళ మీకు రెడ్ కార్పెట్‌పై వయసుపైబడిన మహిళలను చూడటం అలవాటు లేకపోతే.. ఇప్పటికైనా ఆ అలవాటు చేసుకోండి. థాంక్స్! అంటూ ట్రోలర్ల నోళ్లు మూయించారు. ఈ ఏడాది కాన్స్ వేదికపై ఐశ్వర్యా రాయ్ సరికొత్త ప్రయోగాలతో అలరించారు. మొదటి రోజు ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ రూపొందించిన -లుమినారా- అనే ప్రత్యేకమైన బ్లూ కౌచర్ దుస్తులలో మెరిశారు. అంతరిక్షంలో కాంతి ప్రయాణించే శైలిని ప్రతిబింబిస్తూ వింగ్స్ డిజైన్ తో రూపొందించిన ఈ ఆర్కిటెక్చరల్ డ్రెస్ కాన్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆ తర్వాత లోరియల్ పారిస్ నిర్వహించిన ఒక ప్రత్యేక గాలా ఈవెంట్ కోసం సోఫీ కౌచర్ డిజైన్ చేసిన రొమాంటిక్ పింక్ సిల్క్ గౌన్ తో షిఫాన్ కేప్‌లో ఐశ్వర్య ఒక యువరాణిలా వెలిగిపోయారు. ఐశ్వర్య తన మూడవ అప్పియరెన్స్‌గా క్లాసిక్ హాలీవుడ్ ఎలిగాన్స్ - మోడ్రన్ స్టైల్ కలబోసిన ఒక బోల్డ్ వైట్ ప్యాంట్ సూట్ లో కనిపించారు. నిజానికి ఈ కాన్స్ వేడుకల్లో లోరియల్ బ్రాండ్ కేవలం కొత్త అంబాసిడర్ అలియా భట్ ప్రమోషన్లకే ప్రాధాన్యత ఇస్తోందని, సీనియర్ అయిన ఐశ్వర్యను పక్కన పెట్టిందంటూ అంతకుముందు సోషల్ మీడియాలో పెద్ద రచ్చ జరిగింది.

దీనిపై స్పందించిన సదరు కాస్మెటిక్ బ్రాండ్.. అలియా ప్రారంభ వేడుకలలో భాగమవగా... ఐశ్వర్య ముగింపు వేడుకలలో అంబాసిడర్‌గా సందడి చేయబోతున్నారని స్పష్టతనిచ్చింది. గ్లామర్ ప్రపంచంలో హీరోయిన్ల వయసు, శారీర ఆకృతి మార్పులపై నిరంతరం జరిగే బాడీ షేమింగ్, ఏజ్ షేమింగ్ ధోరణిని కంగనా ప్రశ్నించిన తీరు ఇండస్ట్రీలో ప్రశంసలందుకుంటోంది. ఐశ్వర్య వంటి గ్లోబల్ స్టార్స్ తమ వయసును హుందాతనాన్ని అంతర్జాతీయ వేదికలపై గర్వంగా ప్రదర్శిస్తున్నప్పుడు దానిని అభినందించాల్సింది పోయి కేవలం కించపరచడం ఎంతవరకు సమంజసమనే చర్చ మళ్లీ మొదలైంది.

# ఆ హీరోయిన్ సినిమా రిలీజైందా.. ట్రోలింగే



బాలీవుడ్లో పెద్దగా టాలెంట్ లేకపోయినా కరణ్ జోహార్ లాంటి వాళ్ల అండతో అవకాశాలు అందుకుంటూ ఉంటారంటూ నెపో కిడ్స్ కొందరి మీద విమర్శలు వస్తుంటాయి. ఈ జాబితాలో చాలా ముంది ప్రస్తావించే వాళ్లలో అనన్య పాండే పేరు ముందు వరుసలో ఉంటుంది. సీనియర్ నటుడు చుంకీ పాండే తనయురాలైన అనన్య.. 2019లో కరణ్ జోహార్ మూవీ 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్-2'తో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.

అనన్య సినీ రంగంలోకి వచ్చి ఏడేళ్లు కావస్తుండగా.. ఇప్పటిదాకా రెండంకెల సంఖ్యలో సినిమాలు చేసినప్పటికీ.. నటిగా పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది అనన్య. అందాలు ఆరబోయడం తప్పితే ఆమెలో ఎలాంటి టాలెంటూ లేదని తన సినిమా రిలీజైనపుడల్లా నెటిజన్లు ట్రోల్ చేస్తుంటారు. తెలుగులో ఆమె విజయ్ దేవరకొండ సరసన నటించిన 'లైగర్' సినిమా ఎంత పెద్ద డిజాస్టర్ అయిందో తెలిసిందే. ఆ సినిమాలో తన పాత్ర, నటన ఎంత ఇరిటేటింగ్ ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆ సినిమా రిలీజ్ టైంలోనూ ఆమె మీద విపరీతంగా ట్రోలింగ్ జరిగింది.

తాజాగా అనన్య నుంచి 'చాంద్ మేరే దిల్' అనే సినిమా వచ్చింది. 'కిల్' సినిమాతో మంచి గుర్తింపు సంపాదించిన లక్ష్య ఇందులో హీరోగా నటించాడు. అనన్య సినిమాల్లో చాలా వరకు ప్రొడ్యూస్ చేసిన కరణ్ జోహారే ఈ చిత్రాన్ని కూడా నిర్మించాడు. ఈ సినిమాకు కొంచెం పాజిటివ్ టాకే వచ్చినా.. లక్ష్య పెర్ఫామెన్సును అందరూ మెచ్చుకున్నా.. అనన్య మీద మాత్రం విమర్శలు తప్పట్లేదు. ముఖ్యంగా ఇందులో ఆమె భరత నాట్యం చేసే ఒక సన్నివేశం మీద ఒక రేంజిలో ట్రోలింగ్ జరుగుతోంది.

ఒక రోబో క్లాసికల్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో.. అనన్య అలా చేసిందంటూ తన మీద తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. భరత నాట్యాన్ని ఖూనీ చేసిందని ఆమె మీద మండిపడుతున్నారు క్లాసికల్ డ్యాన్స్ లవర్స్. మంచి సినిమా చేసినా సరే.. తన పెర్ఫామెన్స్ మీద విమర్శలు వచ్చాయంటే ఆ హీరోయిన్ పరిస్థితేంటో చెప్పాల్సిన పని లేదు. ఈ సినిమాలో అనన్య కథానాయిక కాకపోతే పెద్ద హిట్టయ్యేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

# కోకాపేటలో ప్రభాస్ డ్రీమ్ హౌస్.. 300 కోట్ల బడ్జెట్‌తో భారీ మాన్షన్!



పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ తన కలల ఇంటిని సాకారం చేసుకునే పనిలో సీరియస్‌గా నిమగ్నమయ్యారు. దాదాపు రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కోకాపేట్ ఓఆర్ఆర్ జంక్షన్ సమీపంలో ఎకరం రూ.75 కోట్ల చొప్పున భారీ ధర వెచ్చించి కొన్ని ఎకరాల భూమిని ఆయన కొనుగోలు చేశారు. ఇప్పుడు అదే స్థలంలో ఒక అత్యంత విలాసవంతమైన భారీ ప్యాలెస్ లాంటి ఇంటి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అత్యంత సమీపంలో ఇది ఉంది. ప్రభాస్ వ్యక్తిగత అభిరుచికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్ల పర్యవేక్షణలో ఈ మాన్షన్ రూపుదిద్దుకుంటోందని సమాచారం. కేవలం భూమి కొనుగోలుకే వందల కోట్లు ఖర్చు చేయగా.. ఈ ఇంటి నిర్మాణం కోసం కనీసంగా రూ.300 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారనే గుసగుసలు ఇప్పుడు టాలీవుడ్‌లో వైరల్ అవుతున్నాయి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి సొంత ఇల్లు ఆ ఏరియాకే ల్యాండ్‌మార్క్‌గా విరాజిల్లుతోంది. ముంబైలో అమితాబ్ బచ్చన్ - జల్సా, షారూఖ్ ఖాన్ -మన్నత్ తరహాలోనే చిరంజీవి నివాసం కూడా సందర్శకులకు, టూరిస్టులకు ఒక స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది.

ప్రజాలక్ష్యం



# తమిళనాట అన్నా డీఎంకెకు ఝలక్

**- ముగ్గురు ఎమ్మెల్యలే రాజీనామా**

**- టివికెలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్**

చెన్నై,మే25: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

# ప్రధాని మోడీ విధానాలే దేశానికి శాపం

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వీ.హెచ్ మాట్లా డుతూ.. 'దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం. మోదీ నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులు అంబానీ, అదానీ లాభపడుతున్నారు. ప్రధాని మోదీ నిరంతరం జపించే 'సబ్ కా సాత్-సబ్ కా వికాస్' అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది. ఆచరణలో మాత్రం అది 'అందరినీ ఇబ్బంది పెట్టే' విధానంగా మారింది. యుద్ధాన్ని ఆపేందుకు మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదు? మోదీకి ట్రంప్ ఫ్రెండ్ అని అంటారు కదా ట్రంప్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపవచ్చు కదా. దేశ ఆర్థిక పరిస్థితి కుంగి పోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకి ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా?' అని అన్నారు.

# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మద్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# కాక్రోచ్ జనతాపార్టీపై అత్యసవర విచారణ

మొదటి పేజీ తరువాయి

నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడు తుండడంతో సోమవారం న్యాయవాదులను ద్దేశించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వే గానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుం టున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతాపార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమ యంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్‌కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా..' దానికంత భావోద్వే గానికి లోనుకా వద్దు' అని సిజెఐ అన్నారు.

# పద్మ పురస్కారాన్ని స్వీకరించిన హర్మన్ ప్రీత్ కౌర్

మొదటి పేజీ తరువాయి

వికాసానికి తోడ్పడిన ఆమెను ఈ సందర్భంగా ముర్ము అభినందించారు. పద్మశ్రీకి ఎంపికైన రోహిత్ శర్మ మాత్రం అవార్డు వేడుకలో కనిపించలేదు. నిరుడు సొంతగడ్డపై భారత జట్టుకు వన్డే ప్రపంచకప్ కట్టబెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాను విశ్వవిజేతగా నిలిపింది. దిగ్గజ కెప్టెన్లు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి వాళ్లకు సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకున్న కౌర్‌ను భారత ప్రభుత్వం పద్మ శ్రీతో సత్కరించింది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం సంప్రదాయ దుస్తుల్లో హాజరైన హర్మన్‌ప్రీత్ ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చేతులు మీదుగా అవార్డును అందుకుంది. నవంబర్ 2న జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రి కాను 52 పరుగుల తేడాతో ఓడించిన భారత జట్టు తొలిసారి జగజ్జేతగా అవతరించింది.





# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటి పేజీ తరువాయి

రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల' ను ఏర్పాటు



చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

# బతికుంటే సహాయం సున్నా

మొదటి పేజీ తరువాయి

కక్షసాధింపులు, విమర్శలు, ప్రచార హోరులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో పాలన సాగిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మార్పు ఇదేనా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా..? అని నిలదీశారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు ఉపయోగించే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితికి నిదర్శనమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ కుటుంబం తమ బంధువు మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు వెంకన్న అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు మార్చురీ వ్యాన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వేడుకున్నారు. రెండు గంటల పాటు ఎదురుచూసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చివరకు చేసేదేమీ లేక కండె వెంకన్న మృతదేహాన్ని బంధువులే భుజాలపై మోసుకుంటూ ఇంటికి తీసుకెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడటం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్దాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మన పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రతి ఓటు విలువైనదే.. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు సుఖంగా జీవించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమ హయాంలో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. పేదలు తెలియక ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుంటే జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చామని అన్నారు. రెండున్నర లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ శనివారం, ఆదివారం నాడు ఇండ్లు కూలగొట్టారని కేటీఆర్ మండిపడ్డారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటికి హైడ్రా అధికారులు నోటీసులు అంటించారని.. ఇల్లు పోతుందనే భయంతో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టలేదు.. కానీ కూలగొట్టిన ఇండ్లు వేలల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే ఇండ్లు కూలగొట్టే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రీ అంటే ఇళ్లను కట్టాలి కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఇళ్లను కూలగొడుతున్నాడని మండిపడ్డారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించు కున్నారని.. తెలంగాణలో మాత్రం ఆ దరిద్రాన్ని తెచ్చుకున్నామని అన్నారు. దొంగ గ్యారంటీ కార్డులతో కొంప ముంచారని మండిపడ్డారు. కేసీఆర్ కల్యాణ లక్ష్మీకి రూ.లక్ష ఇస్తే.. కాంగ్రెస్ వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామని అన్నారని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క రూపాయి అయినా పెన్షన్ పెంచిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయ్యిందని.. ఒక్కరికైనా రూ.2500 వచ్చాయా అని అడిగారు. కోడలుకు రూ.2500 ఇస్తామన్నాడని.. అత్తకు 4వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చాడని తెలిపారు. ఇలా ప్రతి వర్గానికి శఠగోపం పెట్టారని అన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని కేటీఆర్ తెలిపారు. టీ హబ్ పేరిట డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నిజాం కట్టిన ఆస్పత్రులు తప్ప కాంగ్రెస్ ఒక్క ఆస్పత్రి కట్టలేదని అన్నారు. కేసీఆర్ హయాంలో నగరానికి నాలుగు వైపులా 4వేల పడకలతో టిమ్స్ పేరుతో 4 ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కేసీఆర్ నిర్మాణం చేస్తే రేవంత్ రెడ్డి కత్తెర పట్టుకుని తిరుగుతున్నాడని విమర్శించారు.

# అట్టహాసంగా పద్మ పురస్కారాలు

మొదటి పేజీ తరువాయి

13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పుర స్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రా వుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకా రిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్ర పతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

మొదటి పేజీ తరువాయి

సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

# దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

మొదటి పేజీ తరువాయి

రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కల్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ÷ూష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

మొదటి పేజీ తరువాయి

ఇండ్లపై కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ అంటూ సవాల్ చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం. రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు సున్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు! రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ అని అన్నారు.

# కార్పొరేషన్ కమీషనర్‌పై కన్నెర్ర చేసిన పారిశుధ్య కార్మికులు



**- మున్సిపల్ ఆఫీస్ ఎదుట కార్మికుల ధర్నా**
**- మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలి**
**- కార్మిక సంఘాల నాయకుల డిమాండ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 25 : రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణ శ్రీ వైఖరి పై కార్మిక లోకం కన్నెర్ర చేసింది. పారిశుధ్య కార్మికురాలు మల్లమ్మ మృతికి నిరసనగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్కార్పొరేషన్ ముందు ఆఫీస్ సోమవారం మెరుపు సమ్మె కు దిగారు దాదాపు 4 గంటల పాటు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు .కార్పొరేషన్ కమిషనర్ ను బర్తరఫ్ చేయాలంటూ కార్మికులు పెద్దపెట్టున నినాదలు చేశారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కమిషనర్ ను ఇక్కడ నుంచి బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ వైఖరి పై మహిళా కార్మికులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వేల్పుల కుమారస్వామి, నడిపెల్లి మురళీధర్ రావు, ఎంఎ గౌస్, 41 డివిజన్ కార్పొరేటర్ మార్కాపురి సూర్య మాట్లాడారు. కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ అధికార పార్టికి ఏజెంట్ లాగా వ్యవహరిస్తూ పారిశుధ్య కార్మికుల ను వేధింపులకు గురి చేస్తుందని వారు ఆరోపించారు. ఈనెల 21న మల్లమ్మ అనే మహిళ కార్మికురాలు వడదెబ్బకు గురై పని ప్రదేశంలోని కుప్ప కూలిపోతే ఏమాత్రం స్పందించకుండా, తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం దారుణమని అన్నారు. కమిషనర్ అలసత్వం వల్లే మల్లమ్మ మృతి చెందిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల తర్వాత మృతదేహం కుళ్ళిపోయి వాసన రావడంతో గుర్తించాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. కార్మికులను కనీసం మనుషులుగా కూడా చూడటం లేదని, పని ఒత్తిళ్లతో మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాగా మల్లమ్మ కుటుంబానికి రూ. 20 లక్షల రూపాయలు నష్టపరిహారం తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని మున్సిపల్ కమిషనర్ ను బర్తరఫ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి కార్మికులను కట్టు బానిసలుగా చూస్తూ, వారిపై పని భారాన్ని మోపుతూ, మానసికంగా వేధింపులకు గురి చేస్తూ, కకపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో ఎవరు కార్మికులు ఎండ దెబ్బ తగిలి ఆసుపత్రి పాలైనారని, మరో ముగ్గురు కార్మికులు మరణించారని, అవి మరవక ముందే ఇప్పుడు గాజనవేన మల్లమ్మ వడ దెబ్బతో చనిపోవడం కార్మికులను కలవరపరుస్తుందని అన్నారు. మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందివ్వకుండా నిర్దేశించిన పని పూర్తి చేయాలని లేకుంటే మాస్టర్ వేయమని, పనుల్లోంచి తీసేస్తామని. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా చీపుర్లు, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, తట్టలు, పారలు, బ్లౌజులు, మాస్కులు ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం రామా చారీ, కిషన్ నాయక్, గుంజ రమణ, రామలక్ష్మి, రేణికుంట్ల సారయ్య,పాముకుంట్ల సునీత, బోయిని రవీందర్, తోటపెల్లి శేఖర్,శోభన్, మద్దికుంట శ్రీకాంత్, కావటి సాగర్, ఓర్సు రమాదేవి, కౌసల్య, బిఆర్ఎస్ అనుబంధ యూనియన్ నుండి వేల్పుల రాయమల్లు, రొడ్డ రాజేందర్ రమేష్,రూప,రవి, నర్సయ్య, పద్మ, లత, ముంతాజ్ లతోపాటు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.



# మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 25: రైస్ మిల్లర్లు యాసంగి వరి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి రైస్ మిల్లర్లు, వాహనాల కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి వేగవంతంగా చేయాలని, జాప్యం ఉండకూడదని తెలిపారు. హమాలీల కొరత లేకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని, ధాన్యం తరలింపులో వాహనాల కొరత లేకుండా సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాలను అందుబాటులో ఉంచాలని అవసరం మేరకు స్థానికంగా ఉన్న వాహనాలను వినియోగించుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, గోనె సంచుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి జిల్లా అధ్యక్షులుగా రత్నం

**- ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోషాధికారిగా శ్రీనివాసరావు ఎన్నిక**
**- ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నూతన కమిటీ కూడా ఏకగ్రీవం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 25 : టీయూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా రత్నం, ప్రధాన కార్యదర్శిగా జునుమాల రమేష్, కోషాధికారిగా శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా 3వ మహాసభ ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు సాగిస్తామని హామీ ఇచ్చారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విలేకరుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశాలు నిర్వహించడంతో పాటు జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో యూనియన్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని పేర్కొంటూ తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ రాయణ్, జర్నలిస్టు నాయకులు వేణు, వెంకట్రావు, ఏనుగు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌తో పాటు జిల్లా జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.





**ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నూతన కమిటీ ఎన్నిక:**

ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా భద్రాద్రి జిల్లా నూతన కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రెడ్డిమల్ల నవీన్, ప్రధాన కార్యదర్శిగా జి. నాగచంద్ర, కోషాధికారిగా ఎన్. రాజేష్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ప్రభుదాస్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా టి. రవికుమార్, శ్రీహరి ఎన్నిక కాగా, మరో 13 మందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# అవినీతికి అడ్డగా మారిన మెట్పల్లి మున్సిపాలిటీ

**- బిజెపి పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్**
**- మున్సిపల్ ముందర బిజెపి కౌన్సిలర్లు, నేతల ధర్నా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 25 : మెట్‌పల్లి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నా పట్టించుకోకపోవడాన్ని వ్యతిరేకిస్తూ బిజెపి నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మెట్పల్లి పట్టణ శాఖ అధ్యక్షులు ధోనికేల నవీన్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని 2023-24 సంవత్సరంలో జరిగిన క్రీడా మైదానాల అవినీతిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలని, హరితహారం పేరుతో లక్షల రూపాయల కుంభకోణం జరిగిన కూడా పట్టించుకోవడంలేదని, ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ క్రీడ మైదానాలను ఏర్పాటు చేసి 25 లక్షల కుంభకోణం జరిగినా కూడా అధికారులు చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. శానిటేషన్ లో అవినీతి కూరుకుపోయినా పాలకవర్గం ఎందుకు చర్యలు చేసుకోవడం లేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణలపై కమిషన్లకు కక్కుర్తి పడుతున్న అధికారులపై నిఘా పెంచాలని, మున్సిపల్ అధికారుల ఇళ్లపై సోధాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెట్పల్లి పట్టణ పరిశుభ్రతపై అలసత్వం వహిస్తూ తూ..తూ మంత్రంగా పరిశుభ్రత పనులను పట్టించుకోని అధికార యంత్రాంగంపై అధికారుల చర్యలు నామ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బిజెపి కౌన్సిలర్లు ఆందోళన చేపట్టి, వాకౌట్ చేసి, బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ధోనికెల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మెట్పల్లి మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్, బిజెపి కౌన్సిలర్లు దొనికెల శిరీష నవీన్, బోడ్ల వసుధ, నాగేష్, కుడుకారపు దివ్య కిషోర్, కోయల్కర్ స్రవంతి, లింగేశ్వర్, బిజెపి నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, తిరుసుల్ల అర్జున్. కొయ్యల లక్ష్మణ్. లక్ష్మీపతి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.


# క్రీడలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదం చేస్తాయి

**-సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి**
**-ఘనంగా సింగరేణి కార్మికుల పిల్లల వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 25 : క్రీడలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సోమవారం కృష్ణకాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో వర్కర్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల పిల్లల కోసం గత 25 రోజులుగా ఉచితంగా నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు. వేసవి సెలవులను సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా క్రీడలపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల ద్వారా ఓర్పు, క్రమశిక్షణ, జట్టు భావన వంటి మంచి లక్షణాలు అలవడతాయని తెలిపారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే వారు జీవితంలోని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలరని పేర్కొన్నారు. చిన్న వయసులోనే కష్టపడి సాధన చేస్తే క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం కార్మికుల పిల్లల కోసం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలు వారి ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ శిబిరంలో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్ విభాగాల్లో 25 రోజుల పాటు నిర్వహించిన శిక్షణను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి. మధుకర్ రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధి యాసిన్, క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, జనరల్ క్యాప్టెన్ మేడ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# సాయిబాబాపై విమర్శలు తగవు

**- శ్రీ రమణానంద మహర్షి**
**- ఘనంగా శత ప్రశ్న శరసంధానం గ్రంథ ఆవిష్కరణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 25 : సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి రచించిన “శత ప్రశ్న శరసంధానం” గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ గ్రంథం ద్వారా షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై ఇటీవల వస్తున్న విమర్శలు, ఆరోపణలు, సందేహాలకు చారిత్రక మరియు ఆధ్యాత్మిక ఆధారాలతో సమాధానాలు ఇవ్వాలని రచయిత లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. “శత ప్రశ్న శరసంధానం” గ్రంథాన్ని 11 భాషల్లో రచించడం విశేషంగా పేర్కొన్నారు. కార్యక్రమానికి తెలంగాణతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ, షిర్డీ సాయిబాబాపై జరుగుతున్న అసత్య ప్రచారాల నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం అవసరమని అభిప్రాయపడ్డారు. సందర్భంగా ప్రసంగించిన సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి, ఏ ఆధ్యాత్మిక మహానుభావుడి గురించైనా సరైన అవగాహన లేకుండా విమర్శలు చేయడం సమాజంలో అయోమయానికి దారితీస్తుందని పేర్కొన్నారు. అలాగే షిర్డీ సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని తెలిపారు. భక్తుల సందేహాలకు సమగ్ర సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు చెప్పారు. భక్తుల శ్రద్ధాభక్తుల నడుమ జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచి కంటి ధనుంజయ్, బి వి సాయి, గుండా మల్లయ్య, మైనంపాటి ప్రసాద్, అనిల్ కుమార్, శ్యామ్, మిరియాల సంజయ్ కుమార్, సాయి వాహిని, విజయలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామక పత్రాల అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 25 : ఉద్యోగంలో ఉన్న సమయంలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కారుణ్య నియామకాల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన ఐదుగురికి ములుగు జిల్లా పరిధిలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ నియామకాలతో సంబంధిత కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం లభించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ,ఆర్డీవో వెంకటేష్,డీఎస్పీ కిషోర్,జిల్లా అధికారులు,సీడీపీఓలు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


**- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ భోర్ఢడే హేమంత్ సహదేవరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 25 : జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలు జరిగే ప్రాంగణంలో తాగునీరు,పారిశుద్ధ్యం, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్,భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎస్పీఎం కార్మికులకు సంపూర్ణ మద్దతు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





కాగజ్‌నగర్, మే 25, : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్( జేకే )పేపర్ మిల్లు కార్మికులు తమ డిమాండ్ల సాధనకై గత ఆరు రోజుల నుండి మిల్లు గేటు ముందు దీక్షలు చేస్తున్నారు. సోమవారం (ఆరవ రోజు) వారి దీక్షలకు మద్దతుగా కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం తమ సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న గోలెం వెంకటేశం, ఏ కే సింగ్, రాజేష్ యాదవ్,నరేందర్ గౌడ్,రాములు, శ్రీనివాస్, సి. వెంకటేష్,పొన్న రమేష్ లకు పూలమాలలు వేసి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు (మాజీ ఎస్పిఎం గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ ఐఎన్టీయు సీ.తరపున ఎన్నుకోబడిన ) గుల్లపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కొక్కుల మురళి, ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న, ఉపాధ్యక్షులు నూతి సుదర్శన్, కొంపెల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎస్పీ ఎం (జె కె) పేపర్ మిల్లు యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నాయకులు వెంటనే స్పందించి స్థానిక కార్మికుల న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కరించకపోతే వారు చేస్తున్న దీక్షలకు మేము కూడా తోడై దీక్షలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

# భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలుతీసుకోవాలి

**- జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ సంకీర్త్**
**- ఎల్ అండ్ టీ గెస్ట్ హౌస్ అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 25 : భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరగ కుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సూచించారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామ సమీపంలోని ఎల్ అండ్ టీ గెస్ట్ హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని సోమవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు వెంటనే స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి అధికారులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడం ఊరటనిచ్చింది.

# మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్, మే 25 : టేక్మాల్ మండలం పరిధిలోని బొడగట్టు గ్రామంలో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ పట్లోళ్ల భూమిరెడ్డి భూమి కొబ్బరికాయ కొట్టి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, విద్యా రంగం మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సంఘం అధికారులు గోపాల్, దుర్గయ్య, జనాభాయి,గ్రామ ఉపసర్పంచ్ ఎర్ర మల్లమ్మ వార్డు సభ్యులు దుర్గాచారి, సంగమ్మ, వెంకయ్య, నాగి లక్ష్మయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com